# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 24-9-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:26 సంచిక:50 పేజీలు 8 వెల:రూ.1/-


## సంపులో పడ్డ ఇద్దరిని రక్షించిన డిజాస్టర్ రెస్క్యూ బృందం

హైదరాబాద్, సెప్టెంబర్ 23: భారీ నీటి సంపులో ప్రమాదవశత్తు పడ్డ ఇద్దరిని సకాలంలో జిహెచ్ఎంసి డిజాస్టర్ రెస్క్యూ బృందాలు చేరుకొని వారిని కాపాడాయి.

వరాల్లోకి వెళితే... గచ్చిబౌలి రాయదుర్గంలోని హనుమాన్ ఆలయం సమీపంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనంలో ఉన్న నీటి సంపులో ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశత్తు పడ్డారని, వారిని కాపాడాలని డయల్ 100కు ఫిర్యాదు వచ్చింది. ఈ ఫిర్యాదును స్వీకరించిన జిహెచ్ఎంసి డిజాస్టర్ రెస్క్యూ బృందం నేడు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుంది.సంపులో సెంట్రింగ్ మెటీరియల్ తొలగింపుకు దిగిన ఇద్దరు నిర్మాణ కార్మికులు ఊపిరి ఆడకపోవడంతో స్పృహ తప్పారు. వీరిని డిజాస్టర్ రెస్క్యూ బృందాలు బయటకు తీసి అపస్మారక స్థితిలో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించి వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సంపులోకి దిగినవారిని అఫ్రోజ్ (25), ఇమ్రాన్ (30)గా గుర్తించారు. కాగా ఫిర్యాదు అందిన వెంటనే జిహెచ్ఎంసి డిజాస్టర్ రెస్క్యూ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని తక్షణమే స్పందించడం పట్ల స్థానికులు అభినందించారు.

### లోటు బడ్జెట్ ఉన్నా..

# సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నాం

- పేద మహిళలకు బట్టలు పెట్టిన సీఎం మన కేసీఆరే
- కాంగ్రెస్ వాళ్లో.. టీడీపీ వాళ్లో ఉంటే ఊళ్లలోకి నీళ్లొచ్చేవా?
- మంత్రి తన్నీరు హరీష్‌రావు
- గజ్వేల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన మంత్రి



సిద్దిపేట, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : లోటు బడ్జెట్ ఉన్నా.. ఎక్కడా వెనుకాడకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలు కొనసాగిస్తుందని, ప్రజల సంతోషమే ప్రధాన ధ్యేయంగా కేసీఆర్ పాలన సాగుతుందని ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం గజ్వేల్‌లో మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొట్టమొదట బతుకమ్మ చీరల పంపిణీని గజ్వేల్‌లో ప్రారంభించామని తెలిపారు. సిద్ధిపేట జిల్లాలో మూడు లక్షల అరవై ఐదు వేల పైచిల్లుకు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు. పేద మహిళకు బట్టలు పెట్టిన ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని హరీష్‌రావు కొనియాడారు. రాష్ట్రానికి ఆర్థిక మాంద్యం వచ్చినా.. కేంద్రంలో కోత పెట్టినా కూడా పెన్షన్లు, కల్యాణ లక్ష్మీ పథకాల్లో మాత్రం కోతలు లేకుండా చూడాలని కేసీఆర్ చెప్పారని హరీష్‌రావు తెలిపారు. రూ.30 నుంచి నలబై వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెసోళ్లో, టీడీపీ వాళ్లో ఉంటే ఊళ్లలోకి నీళ్లు వచ్చేవా అని హరీష్‌రావు ప్రశ్నించారు. నూట యాభై కిలో మీటర్ల నుంచి నీళ్లు తెచ్చి కేసీఆర్ ఆడపడుచుల కష్టాలు తీర్చారని కొనియాడారు. కాంగ్రెస్ వాళు ఉండగా ఒక్క పండుగకైనా బతుకమ్మ చీరలు ఇచ్చారా అని ప్రశ్నించారు. భారత దేశంలో రూ.2016 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని హరీష్‌రావు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారనీ, ప్రజలకు మంచి చేసే ఏపనినైనా సీఎం చేయడానికి సిద్దంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మహిళలకు బతుకమ్మ పండుగ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. పండుగ రోజు రాష్ట్రంలోని ప్రతి ఆడపడుచూ కొత్త బట్టలతో కళకళలాడుతూ ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెరాస నేతలు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో ఘోరం..నలుగురు కుమార్తెలతో తల్లి ఆత్మహత్య

ముంబయి,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని బుల్దానా జిల్లా మాలేగావ్‌లో సోమవారం ఉదయం ఘోరం జరిగింది. తన నలుగురు కుమార్తెలతో సహా బావిలో దూకి ఓ తల్లి ఆత్మహత్య చేసుకుంది. బావిలోంచి ఐదుగురి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే సదరు మహిళ ఈ దారుణానికి ఒడిగట్టినట్టు ఆ గ్రామ ప్రజలు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## అబ్బాయికి అమ్మాయి లక్ష రూపాయలు టోపీ

### మ్యాట్రిమోనీలో పరిచయం

హైదరాబాద్,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): మ్యాట్రిమోని దరఖాస్తుతో పరిచయమయ్యారు. ఫోన్‌లో మాట్లాడుకున్నారు.. స్నేహితురాలికి ఆర్థిక ఇబ్బందులు అని లక్ష రూపాయలు కొట్టేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం...కాప్రా ప్రాంతానికి చెందిన కె.శ్రీరామ్(పేరు మార్చాం) భారత్ తెలుగు మాట్రిమోనిలో వివాహం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తన దరఖాస్తును చూసుకుని కె.శ్రీలత పేరుతో శ్రీరామ్‌కు ఫోన్ చేసి మాట్లాడింది. అలా ఇద్దరి మధ్య పరిచయం పెరిగి తరుచుగా మాట్లాడుకుంటున్నారు. అకస్మాత్తుగా ఒక రోజు శ్రీలత ఫోన్ చేసి తన స్నేహితురాలికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెబితే తాను తన బంగారు నగలను తనఖా పెట్టి ఆమెకు డబ్బు ఇచ్చాను. కొద్ది రోజుల తర్వాత తన స్నేహితురాలు మోసం చేసిందని తెలిసింది. నా బంగారం నగలను విడిపించుకోవాలి కాబట్టి నాకు లక్ష రుపాయలు సహాయం చేయమని శ్రీరామ్‌ను అడిగింది. ఇది నిజమేనని నమ్మిన శ్రీరామ్ రెండుసార్లు శ్రీలత ఇచ్చిన ఖాతాకు లక్ష రూపాయలు వేశాడు. ఆ తర్వాత శ్రీలత ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో మోసపోయానని భావించిన శ్రీరామ్ రాచకొండ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నాలాలో పడిన వ్యక్తి మృతి

### బిహార్ వాసి రకిబుల్ షేక్‌గా గుర్తింపు

హైదరాబాద్,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ): నిజాంపేట పుష్పక్ గృహ సమూదాయం వద్ద నిన్న నాలాలో పడి

కొట్టుకుపోయిన బిహార్‌వాసి రకిబుల్ షేక్ మరణించాడు. ఈ రోజు ఉదయం ఆయన చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. ఉదయాన్నే గజ ఈతగాళ్లతో ఆయన కోసం అధికారులు వెతికించారు. చెరువులోని మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# మహిళలకు పెద్దన్నగా కేసీఆర్



- సీఎం ఇచ్చే చిరుకానుక బతుకమ్మ చీరలు
- పథకాలఅమల్లో దేశంలోనే తెలంగాణది ప్రథమస్థానం
- ఏ రాష్ట్రం నేతకార్మికుల కోసం పథకాలు తీసుకురాలేదు
- మెరుగైన జీవన ప్రమాణాలు స్థాపించే దిశగా ముందుకెళ్తున్నాం
- బతుకమ్మ చీరెల ద్వారా నేతన్నల ఆదాయం రెట్టింపైంది
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- నల్లగొండలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి

నల్లగొండ, సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : తెలంగాణలోని కోటి మంది ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ తోబుట్టువుగా, పెద్దన్నగా అండగా నిలుస్తున్నాడని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. నల్లగొండ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలతో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు.

ఈ నెల 28న బతుకమ్మ ప్రారంభమవుతోందని, ఆడబిడ్డలందరూ బతుకును గౌరవించుకునే పండుగ అన్నారు. ప్రతి సంవత్సరం చాలా కష్టపడి నేతన్నలు చాలా చక్కని చీరలు తయారు చేశారని, పెద్ద మొత్తంలో చీరల పంపిణీ కార్యక్రమం సవ్యంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2001, 2002 సంవత్సరాల సమయంలో పోచం పల్లిలో ఏడు మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని, నాటి ఉద్యమనాయకుడు, నేటి సీఎం కేసీఆర్.. వారికి సహాయం చేయ్యండని, బతుకు మీద భరోసా కల్పించాలని అడిగితే నాటి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. స్వయనా కేసీఆరే జోలెపట్టుకుని డబ్బులు అడిగి.. ఏడు కుటుంబాలకు రూ. 50వేల చొప్పున సహాయం చేశారన్నారు. కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో నాడు ఎనిమిది మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ క్రమంలోనే నేతన్నలకు జీవనోపాధి కల్పించాలని కేసీఆర్ నిర్ణయం తీసుకు న్నారన్నారు.

బతుకమ్మ చీరెలు కాకుండా, బడి పిల్లల యూనిఫాంలను కూడా నేతన్నలకే అప్పజెప్తామని కేటీఆర్ తెలిపారు. యూనిఫాంలు వేసుకునే సింగరేణి, ఆర్టీసీ సంస్థలతో మాట్లాడి రాష్ట్రంలోని నేతన్నలకే అప్పజెప్తామన్నారు. మెరుగైన జీవన ప్రమాణాలు స్థాపించే దిశగా ముందుకెళుతున్నామని, బతుకమ్మ చీరెల ద్వారా ఆదాయం రెట్టింపు అయిందని తెలిపారు. ఈ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల కోసం పథకాలు తీసుకురాలేదు. చేనేత మిత్ర పేరుతో రాష్ట్రంలో నేతన్నలందరికీ భరోసానిచ్చే విధంగా రసాయనాలు, నూలు, అద్దకానికి వాడే వస్తువులను 50శాతం సబ్సిడీతో ఇస్తున్నాం. నేతన్న చేయూత పేరిట నేతన్నల కుటుంబాల కోసం మరో పథకం అమలు చేస్తున్నామన్నారు.

చేనేత లక్ష్మీ పేరిట మరో కార్యక్రమం తీసుకు వచ్చామని కేటీఆర్ తెలిపారు. వరంగల్‌లో అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కును తీసుకువస్తున్నామని, ప్రతి సోమవారం కచ్చితంగా చేనేత వస్త్రాలు ధరించాలనే నిర్ణయం తీసుకుని.. ఆచరించి చూపిస్తున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని, తద్వారా నేతన్నలకు జీవనోపాధి కల్పించిన వాళ్లం అవుతామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అనంతరం మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలోని కోటి మంది ఆడపడుచులకు దసరా కానుకగా బతుకమ్మ చీరలు పంపిణీ జరుగుతుందన్నారు. కార్మికులు చేనేతకు పూర్వవైభవం తెస్తూ బతుకమ్మ చీరలను అందంగా తయారు చేస్తున్నారన్నారు. నల్లగొండపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకమైన ప్రేమ, అభిమానం ఉందని, నల్లగొండ, సూర్యపేటల్లో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని, యాదాద్రి ఆలయాన్ని అబ్బురపడే విధంగా పునర్ నిర్మాణం చేస్తున్నాం న్నారు. యాదాద్రి పవర్ ప్రాజెక్టు, చౌటుప్పల్ ఇండస్ట్రియల్ పార్క్ రూపుదిద్దుకుంటున్నామని, రైతుల ఆత్మహత్యలు ఇక లేవు... చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఇక ఉండవని మంత్రి అన్నారు. 35 వేల కోట్ల రూపాయలతో నల్లగొండలో పనగల్ రిజర్వాయర్‌ను మినీ ట్యాంక్‌బండ్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## ఎనిమిది మంది అక్కడిక్కడే మృతి

జైపూర్,సెప్టెంబర్23 (ఆంఎన్ఎ): రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో సోమవారం తెల్లవాంజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లమనా గ్రామ సమీపంలో ట్రక్కు- బస్సు ఢీకొని ఎనిమిది మంది అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని అజ్మర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వైద్యుడు అనిల్ జైన్ తెలిపారు. బస్సు ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 85 ప్రయాణికులు ఉన్నారు. చాలా మందికూలీలు బతుకు దెరువు కోసం జైపూర్ నుంచి గుజరాత్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## చరిత్రలో నేటినిజం



కం॥ 'బండారు'వంశమందున
నిండుగ 'తిమ్మయ్య'గారు నేర్పుదిలర్చన్
దండిగ రచనమ్ములనిడి
పండితను ఉడుగుచు యుగుల ప్రఖ్యాతిగానెన్!!
[సెప్టెంబరు 24 బండారు తిమ్మయ్య జననం]

( సెప్టెంబర్ 24 బండారు తిమ్మయ్య జననం)

-రాధశ్రీ


సెల్: 9494481210



## అర్ధరాత్రి రెచ్చిపోయిన దొంగలు

హైదరాబాద్,సెప్టెంబర్23(ఆర్ఎస్ఎ): రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఘట్‌కేసర్‌లో అర్ధరాత్రి దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. వరంగల్ జిల్లా, ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన పాన్ మసాలా వ్యాపారులు కళ్యాణ్, సాయి అనే వ్యక్తులను బెదిరించి వారి నుంచి లక్షా యాబై వేల రూపాయల నగదు, 30 గ్రాముల బంగారు గొలుసులు, 16 గ్రాముల రెండు బంగారు ఉంగరాలు, 1800 యూఎస్ డాలర్లు, 3.50 లక్షలు విలువ చేసే పాన్ మసాలాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# సుప్రీంకోర్టులో నలుగురు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం



JUSTICE KRISHNA MURARI



JUSTICE RAVINDRA BHAT



JUSTICE V RAMASUBRAMANIAN



JUSTICE HRISHIKESH ROY

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23: సుప్రీంకోర్టు జడ్జీలుగా జస్టిస్ క్రిష్ణమురారీ, జస్టిస్ శ్రీపతి రవీంద్ర భట్, జస్టిస్ వీ రామసుబ్రమణ్యన్, జస్టిన్ హృషికేశ్‌రాయ్‌లు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 34కు చేరుకుంది. కొత్త న్యాయమూర్తుల రాకతో సుప్రీంకోర్టులో మరో రెండు కోర్టు హాళ్లు ఏర్పాటు చేశారు. 16, 17 కోర్టు హాళ్లను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. ఈ రోజు నుంచి 16 ధర్మాసనాల్లో కేసుల విచారణ జరుగుతుంది.

**జస్టిస్ కృష్ణమురారీ:**

జస్టిస్ కృష్ణమురారీ అలహాబాద్‌కు చెందిన వారు. 1981లో బార్‌కౌన్సిల్ మెంబర్‌గా చేరి అలహాబాద్ హైకోర్టులో ప్రాక్టిస్ చేశారు. 2004 సంవత్సరంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించబడ్డారు. 2018 సంవత్సరంలో పంజాబ్ హర్యాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. సుప్రీంకోర్టులో వీరి పదవీ కాలం 2023 జులై 8వ తేదీ వరకు న్యాయమూర్తిగా కొనసాగుతారు.

**జస్టిస్ రవీంద్రభట్:**

జస్టిస్ రవీంద్రభట్ 2004వ సంవత్సరం నుంచి 15 సంవత్సరాల పాటు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించబడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ ప్రాంతానికి చెందిన జస్టిస్ రవీంద్రభట్ ఢిల్లీలో న్యాయవిద్యను అభ్యసించి 1982వ సంవత్సరంలో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. 2023 అక్టోబర్ 23వ తేదీ వరకు సుప్రీంకోర్టు జడ్జీ పదవిలో కొనసాగనున్నారు.

**జస్టిస్ వీ రామసుబ్రమణ్యన్:**

జస్టిస్ వీ రామసుబ్రమణ్యన్ తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన వారు. మద్రాస్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించారు. 1983 ఫిబ్రవరి 16వ తేదీన న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. 23 సంవత్సరాలపాటు చెన్నై హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టిస్ చేశారు. 2006 సంవత్సరంలో మద్రాస్ హైకోర్టు న్యాయవాదిగా నియమించబడ్డారు. సుప్రీకోర్టు న్యాయమూర్తిగా వారు 2023 జూన్ 30వ తేదీ వరకు కొనసాగనున్నారు.

**జస్టిస్ హృషికేశ్‌రాయ్:**

జస్టిస్ హృషికేశ్‌రాయ్ 2006వ సంవత్సరం గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా నియమించబడ్డారు. 2018వ సంవత్సరంలో కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించబడ్డారు. 1982వ సంవత్సరంలో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి న్యాయవిద్య పట్టా అందుకున్న ఆయన బార్ కౌన్సిల్‌లో తన పేరు నమోదు చేసుకుని తరువాత గౌహతి హైకోర్టులో 2004వ సంవత్సరం వరకు సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టిస్ చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2025 ఫిబ్రవరి 1వ తేదీ వరకు విధులు నిర్వహించనున్నారు.

# గెలిచేది చిత్తశుద్ధి మాత్రమే...!

నేటినిజం
మంగళవారం 24-9-2019

మంచిచేస్తే మనకు మంచే ఎదురవుతుందన్నది మనకు తెలుసు. అలాగే విద్య కూడా అంతే! విద్యను కానీ, విద్యావ్యవస్థలను కానీ కించపరిస్తే, బలహీనపరిస్తే దీర్ఘకాలంలో మొత్తం సమాజమే ధ్వాన్ని కోల్పోతుంది. అధ్వాన్నంవైపే అడుగులు వేస్తుంది. వీధికో పాఠశాల, మండలాల్లో జూనియర్ కళాశాలలు, డిగ్రీకాలేజీలను ఇరుకు భవనాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సువిశాల ప్రాంగణాల్లో రూపుదిద్దుకోవాల్సిన విశ్వవిద్యాలయాలు చిన్న చిన్న భవనాల్లో సర్దుకు పోతున్నాయి.

దేశంలో విద్యావ్యవస్థల దురవస్థ ఇది. పెద్ద పెద్ద డిగ్రీలు(పిజి) పొందినవారు నేరుగా ఉపాధిని పొందలేకపోతున్నారు. విద్యారంగం పూర్తిగా వ్యాపారమైపోయింది. పగ్గాలు పైరవీకారుల హస్తగతమయ్యాయి. సేవాభావంతో పనిచేసే సంస్థలు మచ్చుకైనా కానరావడంలేదు. అంతా విద్యావిధానంలో లోపాలను ఎత్తిచూపడానికి ప్రయత్నించేవారే. వాటిని సరిదిద్దేవారే కరువైపోయారు. దిద్దుబాటు చర్యల గురించి పాలకులే పట్టించుకోకపోతే ఇక ఆచరించి అమలు చేసేదెవరు? ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో విద్యారంగం అనాథ కాక ఏమవుతుంది? దేశంలో ఒకనాడు విద్యాబోధన పవిత్ర వృత్తి. నేడు ఇది పక్కా వ్యాపారంగా మారిపోయింది.

ప్రాథమిక స్థాయి నుండి విశ్వవి ద్యాలయం స్థాయి వరకు కోట్లమంది విద్యార్థులే వినియోగదారులు. మొత్తంగా విద్యారంగం దేశంలోనే పెద్ద పరిశ్రమగా రూపుదా ల్చింది. పరిశ్రమల్లో వినియోగ దారుల అవసరాలకు అనుగుణం గా ఉత్పత్తుల నాణ్యతను పెంపొందిస్తుంటారు. తరాలు మారినా, విజ్ఞానం పెరిగినా మన చదువులు తాతల కాలం నాటివే. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో పట్టభద్రులను ఉత్పత్తి చేస్తూ పోవడమే తప్ప ఆయా పట్టాల విలువను, నాణ్యతను కాపాడి పెంపొందించాలన్న ధ్యాస చదువుల పరిశ్రమకు లేదు. అయితే ఉన్నత విద్యకు యువత నైపుణ్యాలు ఎందుకూ కొరకాకుండా పోతాయి.

భవిష్యత్ యువ భారతదేశానిదేనన్న అంచనాల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితి మన దేశానికి ప్రమాద ఘంటికే. 2020 నాటికి భారతదేశంలో 20 నుంచి 24 ఏళ్ళ లోపున్న వారి సంఖ్య చైనాకంటే ఎక్కువగా ఉంటుందన్న అంచనా. అంది వస్తున్న ఈ అవకాశాన్ని మన పాలకులు సుశిక్షితులుగా తీర్చిదిద్దుకోవాలి. యువశక్తికి నాణ్యమైన విద్య అందించి దేశాభివృద్ధికి వినియోగించు కోవాలి. దేశంలో ఉన్నత విద్య అనేక రుగ్మతలతో సతమత మవుతోంది. ఫలితంగా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు అతి తక్కువ స్థాయిలో ఉంటున్నాయి. ఉన్నత విద్యార్థులు సంఖ్య పెంచుకోవడానికి అసమానతలను అధిగమించాల్సి ఉంటుంది. సామాజిక సమస్యలు, ఆడ, మగ విచక్షణ, పట్టణ, గ్రామీణ తారతమ్యాల వంటి వాటిని తగ్గించడానికి ప్రయత్ని ంచాల్సి ఉంటుంది. ముఖ్యంగా రాష్ట్ర నిధులతో విద్యాసంస్థలను ముందుగా ఆదుకోవాలి. వాటిలో సదుపాయాలను మెరుగు పరచాలి. బోధన స్థాయి పెంపుదలకు చర్యలు చేపట్టాలి. ఇలాంటి పరిస్థితులు లేనందున రాష్ట్రాల్లోని ఉన్నత విద్యాసంస్థల్లో స్థాయికి తగిన బోధన స్థాయి తగ్గిన పరిశోధనలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణా ప్రజల పట్ల, ముఖ్యంగా విద్యార్థుల పట్ల ఎంతో శ్రద్ధను కనపరిచారు. ప్రతి విషయంలోనూ ఆచి తూచి అభివృద్ధి పథంవైపు నడిచారు. రాబోయే ఎన్నికల్లో కూడా విజయపథంలోకి దూసుకుపోయి ఇదే శ్రద్ధతో గమనిస్తారని ఎదురుచూద్దాం..!

# సినిమా టిక్కెట్ బుకింగ్‌కు షాకింగ్

హైదరాబాద్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : శుక్రవారం అంటే లక్ష్మీవారం. అలాగే అది సినిమా వారం కూడా.

శుక్రవారం వస్తుందంటే సినిమా ప్రియులకు పండుగ. వారం వారం ఎదో ఒక సినిమా విడుదవుతుంది. సినిమాల కోసం థియేటర్ కి పరిగెత్తడం, లైన్ లో నిలబడి టిక్కెట్ కోసం పడిగాపులు పడటం సాధారణంగా మనకు కనిపించే దృశ్యం. అంత కష్ట పడుకుంటూ, తిన్నా, తినకున్నా, పడుతూ, లేస్తూ డబ్బుల గురించి ఆలోచించకుండా వందలు, వేలు ఖర్చుపెట్టుకుంటూ సినిమాని ఎంజాయ్ చేసే మనం అసలు అక్కడ ఏం జరుగుతుంది, ఎంత ఖర్చుపెడుతున్నాం అని కూడా ఆలోచించలేని ధీనస్థితి. పెద్ద హీరో సినిమా అయితే

ఇక టిక్కెట్ల గురించి ఎవరూ ఆలోచించరు. అది ఆన్‌లైన్ కావచ్చు...లేదంటే క్యూలైన్ కావచ్చు.

ఒకప్పుడు కొత్త సినిమా అంటే అర కిలో మీటర్ క్యూ లైన్లు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. హ్యాపీగా ఇంట్లో కూర్చుని ఆన్‌లైన్‌లో క్షణాల్లో కావాల్సిన సినిమా టిక్కెట్ బుక్ చేసుకోవచ్చు. హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఇప్పుడు అంతా ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్‌లే. దాంతో అనేక టికెట్ బుకింగ్ యాప్‌లు ఇంటర్నెట్‌లో దర్శనమిస్తున్నాయి. అంతే కాదు అవి జనం వీక్‌నెస్‌ని క్యాష్ చేసుకుంటూ టిక్కెట్ల అడ్డమైన ట్యాక్స్‌లు వేస్తూ వినియోగదారుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు మోసాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో తెలంగాణ సర్కార్ దీనిపై ఫోకస్ పెట్టటం హర్షనీయం. బుక్ మై షో, పేటిఎం,ఈజీ మూవీస్ పేరుతో ఇప్పటికే వివిధ రకాల టాక్స్‌లను సినిమా టిక్కెట్ల రేట్లకు జోడించి సామాన్యుల నుంచి విపరీతంగా దోచేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ యాప్స్‌కు నిజంగా పెద్దషాకనే చెప్పాలి. వాటి ఆదాయానికి పూర్తిగా గండి పడుతుంది. అయితే ఆన్‌లైన్ బుకింగ్ లకు అలవాటు పడ్డ సినీ ప్రేమికుల పరిస్థితి ఏమిటని అనుకోవచ్చు. ప్రభుత్వం ఇప్పటికే దీనికి ఓ ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వం మరో ప్రత్యామ్నాయం కూడా సిద్ధం చేసింది. టిక్కెట్ల అమ్మకాల కోసం ఫిలిం ఫెడరేషన్ కార్పొరేషన్ ప్రత్యేక వెబ్ సైట్‌ను ఏర్పాటు చేయనుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కేవలం యాప్‌ల మీదే పడుతుందా ? వినియోగదారులకు ఇబ్బందికరంగా మారుతుందా అన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం సామాజిక మాధ్యమాలు, సినీ రంగం నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంతో చిన్న థియేటర్లకన్నా మల్టీ ప్లెక్స్ లపై ఎక్కువ ప్రభావం పడే అవకాశం ఉంది. ఎందుకంటే సదుపాయాల పేరుతో మల్టీప్లెక్స్‌లు టక్కెట్ ధరను విపరీతంగా పెంచుతున్నాయి. ఎంటర్‌టెయిన్‌మెంట్, షాపింగ్, గేమ్స్, ఫుడ్ కోర్ట్స్ వంటివి ఉంటాయి. అయితే వాటి నుంచి వారికి వ్యాపార లబ్ధి చేకూరుతుంది. అయినా టిక్కెట్ ధరలో వాటికి సంబంధించిన టాక్స్‌లు వేయకుండా ఉండరు. టిక్కెట్ల ధర కాస్త ఎక్కువగా ఉన్న తమకు మంచి ప్రైవసీ ఉంటుందని చాలామంది మల్టీప్లెక్స్‌లకు వెళుతుంటారు. దీనినే వారు క్యాష్ చేసుకుంటున్నారు. మొబైల్ అప్స్, వెబ్ సైట్ల ద్వారా టిక్కెట్ల బుకింగ్ బాగా పెరిగింది. ఎంత దోచుకున్నా అడిగేవాడు లేడు. అయితే ఇప్పుడు సర్కార్ స్వయంగా రంగంలోకి దిగటంతో ఇక వారి ఆట కట్టు అని మాత్రం అర్థమవుతోంది. తాజా నిర్ణయంతో ఎంటర్‌టెయిన్‌మెంట్ రంగంలో ఏం జరుగుతుందో చూడాలి!!

# నగరంలో ఇంకుడు రోడ్ల ప్రయోగం!

హైదరాబాద్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): నగరంలో వర్షం పడితే నగరవాసులకు మిగిలేది నీరసమే. ఎందుకంటే వర్షం అనగానే రోడ్ల మీద నిలిచే నీరు.. పొంగి ప్రవహించే డ్రైనేజీలు.. రోడ్లపైకొచ్చే చెత్తా చెదారం.. ట్రాఫిక్ ఇక్కట్లు ఇదీ మన కళ్ల ముందు కనిపించే దృశ్యం. అయితే దీనికి బ్రేక్ వేయాలంటే ఓ మార్గం ఉంది. ఎక్కడ పడిన వర్షం అక్కడ భూమిలోకి ఇంకిపోతే.. రోడ్ల మీద పడ్డ నీరు కాలువలకు కాకుండా రోడ్ మీదే ఇంకిపోతే ఎలా ఉంటుంది అనే ఆలోచనతో ఇప్పుడు నగరంలో 'పర్మియబుల్ రోడ్డు' ప్రయోగం చేపట్టారు. ఓల్డ్ సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆరు మీటర్ల వెడల్పు 20 మీటర్ల పొడవు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంలో ఇసుక వాడకపోవడంతో వర్షం నీరు రోడ్డులోకి ఇంకుతుందని, ఇలాంటి రోడ్లతో భూగర్భ

జలమట్టం కూడా పెరుగుతుందని అధికారులు అంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కిలోమీటర్ కి రూ.30 లక్షల ఖర్చు చేయాల్సి ఉంటుందని, నీరు భూమిలోకి ఇంకడం ఈ రోడ్ల ప్రత్యేకత అంటున్నారు. పర్మియబుల్ రోడ్లు మన దగ్గర ఆలోచనల్లోనే ఉంటే విదేశాల్లో ఎప్పుడో అమలవుతోంది. అక్కడి రోడ్లపై ఎన్ని వేల లీటర్ల నీటిని పోసినా కేవలం ఒకే నిమిషంలో ఆ నీరంతా రోడ్లలోకి ఇంకిపోతుంది. మరి మన హైదరాబాద్లో పూర్తిస్థాయి వినియోగం ఎప్పుడో!!

# హౌడీ మోడీలో అమెరికా..భారత్ స్నేహగీతం

హైదరాబాద్, సెప్టెంబర్ 23:భారత ప్రధాని నరేంద్ర మోడీ అగ్రదేశం అమెరికా పర్యటన ప్రపంచం దృష్టిని విపరీతంగా ఆకర్శిస్తోంది. కశ్మీర్ స్వయంప్రతిపత్తి రద్దుతో దాయాది పాకిస్తాన్ చేస్తున్న బూటకపు ప్రచారం నేపథ్యంలో మోడీ పర్యటన ప్రపంచ దేశాల దృష్టిని అమితంగా ఆకర్శించటం సహజం. ఆదివారం హ్యూస్టన్‌లో జరిగిన హౌడీ-మోడీ కార్యక్రమం ఊహించిన విధంగానే విజయవంతమైంది. వచ్చే ఏడాది అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ హాజరు కావటం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోమారు అధ్యక్ష పీఠం అధిష్టించాలని ఆశపడుతున్న ట్రంప్‌కు ఇది ఒక రాజకీయ అవసరం. ఇప్పటి వరకు డెమోక్రాట్లకు మద్దతిస్తూ వచ్చిన భారత సంతతి పౌరులను తన వైపు తిప్పుకోవాలన్నది ట్రంప్ రాజకీయ ఎత్తగడ. నిధుల సమీకరణ, లాబీయింగ్, ప్రచారంలో ప్రవాస భారతీయుల ప్రభావం ఎంతో గతంలో పలు ఎన్నికలు నిరూపించాయి. గత అధ్యక్ష ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్‌కు మద్దతిచ్చారు. అయితే ఆమె వెంట్రుక వాసి తేడాతో పరాజయం పాలయ్యారు. కాని ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. ట్రంప్ ప్రజాదరణ మునపటికన్నా తగ్గిందని సర్వేలు చెబుతున్నాయి. దీంతో ఆయన భారత సంతతివారిని ప్రసన్నం చేసుకునేపనిలో పడ్డారు. ఆయన ఆశ ఎంతవరకు నెరవేరుతందని ఇప్పుడే చెప్పలేం. కానీ, మోడీ పర్యటన ఆయనకు సహకరిస్తుందనేది నిర్వివాదాంశం.

మరోవైపు, పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు నెలకొన్నవేళ అమెరికా మద్దతు భారత్‌కూడా చాలా అవసరం. ఒక్కమాటలో చెప్పలంటే ఇది ఇచ్చిపుచ్చుకునే పర్యటన. హ్యూస్టన్ వేదికగా జరిగిన హౌడీ మోడీ కార్యక్రమంలో ప్రధాని మోడీ పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించటం చూసిన వారికి విషయం ఈ అర్థమవుతుంది. ఇప్పుడున్న మార్కెట్ ప్రపంచంలో శాశ్వత శత్రువులు శాశ్వత మిత్రులు ఉండరనేదే అందరికీ తెలుసు. దక్షిణాసియాలో కొన్ని దశాబ్దాలుగా పాకిస్తాన్..అమెరికాకు వ్యూహాత్మక మిత్రుడు. అయితే ఇప్పుడు అది గతం ..ఉగ్రవాదంపై పోరులో పాకిస్తాన్ విఫలమైందని అమెరికాతో పాటు ప్రపంచానికి బహు బాగా అర్థమయింది. దాంతో పాక్ క్రమంగా అమెరికా అండ కోల్పోతూ వస్తోంది. ఇదే సమయంలో కొన్నేళ్ల నుంచి అది భారత్ అనుకూల విధానం అవలంబిస్తోంది. ఇప్పుడు అమెరికాకు మనం నమ్మకమైన మిత్రదేశం. హౌడీ మోడీ కార్యక్రమంలో ట్రంప్ స్వయంగా ఈ విషయం చెప్పటం విశేషం. తనకు అత్యంత నమ్మకమైన స్నేహితుడు మోడీ అని ట్రంప్ అభివర్ణించారు.

మరోవైపు, హ్యూస్టన్ వేదికగా మోడీ ఉగ్రవాద వ్యతిరేక గళాన్ని ప్రపంచానికి అర్థమయ్యేలా బలంగా వినిపించటంలో విజయవంతమయ్యారు. పాకిస్తాన్ లక్ష్యంగా సాగిన ఆయన ప్రసంగంలో ఆ దేశంపై దుమ్మెత్తి పోశారు. 9/11 ఉగ్రవాదులు, 26/11 ముంబై ఉగ్రదాడుల మూలం ఒక్కటేనని ఆయన గుర్తుచేశారు. అలాగే ఆర్టికల్ 370 రద్దు అవసరం ఏమిటో హ్యూస్టన్ వేదికగా ప్రపంచానికి అర్థమయ్యేలా చెప్పారు. ఇక ఉగ్రమూలాలు ఏదేశంలో ఉన్నాయో ప్రపంచానికి తెలుసంటూ పరోక్షంగా పాకిస్థాన్‌కు చురకలు అంటించారు. రేపు పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అవుతున్న నేపథ్యంలో మోడీ చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి.

ఇదే సమయంలో మోడీ తమ ప్రభుత్వ ఎంత అద్భుతమైన పాలన అందిస్తుందో చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వ లక్ష్యాలను హ్యూస్టన్ వేదికగా మరోసారి వినిపించారు. సంకల్పం నుంచి సాకారం వరకు? అన్న మోడీ.. ఇదే భారత్ కొత్త నినాదం అన్నారు. నవీన భారత నిర్మాణమే ఈ సంకల్పానికి లక్ష్యంమని.. మమ్మల్ని మేమే పోటీదారులుగా భావిస్తున్నామన్నారు. 97 శాతం గ్రామాలకు ఐదేళ్లలో రోడ్లు వేశామని..

గత ఐదేళ్లలో 2లక్షల కి.మీ. మేర గ్రామీణ రోడ్లు నిర్మించామన్నారు. అంతేకాదు వందశాతం ప్రజలను బ్యాంకులకు అనుసంధానం చేయగలిగామన్నారు. 37 కోట్ల మందితో కొత్త బ్యాంకు ఖాతాలు తెరిపించామని మోడీ వివరించారు.

ఇక హౌడీ, మోడీ కార్యక్రమంలో ట్రంప్ ప్రసంగం కూడా ప్రవాస భారతీయులను అమితంగా ఆకట్టుకుంది. ప్రపంచాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణిచివేస్తామని హ్యూస్టన్ వేదికగా ట్రంప్ స్పష్టం చేయటం విశేషం. భారత్- అమెరికాల స్వప్నాలు సాకారం చేసేందుకు మోదీతో కలిసి పనిచేస్తామనటం భారత్ ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటానికి అదనపు బలం. భారత్ అత్యున్నత విలువలు, సంస్కృతి? అమెరికా విలువలతో కలిసిపోతాయనటం ఆయన భారత్‌కు అమెరికా ఇస్తున్న ప్రధానత్యకు అద్దంపడుతుంది. అంతేగాక తాను అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తరువాత ఇరుదేశాల మధ్య స్నేహం మరింత బలపడిందని ,కొన్నేళ్లుగా భారత్-అమెరికా సంబంధాలు ఎన్నడూలేనంత బలోపేతమయ్యాయయని చెప్పటం భవిష్యత్‌లో కూడా అది భారత్‌తో స్నేహాన్ని ఎంతగా కోరుకుంటోందో అర్థమవుతోంది. !!



# అన్నివర్గాల ప్రజల అభివృద్ధే కేసీఆర్ ధ్యేయం

**- రాష్ట్రం అన్నిరంగాల్లో వేగంగా దూసుకెళ్తుంది**
**- మంత్రి సత్యవతి రాథోడ్**
**- సమ్మక్క-సారలమ్మలకు బతుకమ్మ చీరలను సమర్పించిన మంత్రి**

వరంగల్, సెప్టెంబర్23(నేటినిజం ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం దసరా సందర్భంగా మహిళలకు అందిస్తున్న బతుకమ్మ చీరల పంపిణీని మేడారం నుంచి గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె సోమవారం తొలిసారిగా మేడారంలోని అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవార్లకు ఆమె బతుకమ్మ తొలి చీర అందించారు. ముఖ్యమంత్రి కేసిఆర్ గారు ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక పథకం బతుకమ్మ చీరల పంపిణీని మేడారం నుంచి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తన తొలి పర్యటన గిరిజన ప్రాంతంలో జరపడం, మహిళలకు సంబంధించి, అత్యంత ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ పండగ చీరల పంపిణీతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందించదగ్గ విషయమన్నారు. గిరిజన తండాలో పుట్టి, పెరిగిన తనకు ముఖ్యమంత్రి మంత్రివర్గంలో స్థానం కల్పించడం, అదనపు భాద్యతను పెంచిందని ఆమె అన్నారు. సీఎం నమ్మకాన్ని నిలబెట్టాలనే కోరికతో మేడారం సమ్మక్క-సారలమ్మ ఆశీర్వాదం తీసుకొని, బతుకమ్మ తొలి చీరలను అమ్మవార్లకు సమర్పించానన్నారు. అమ్మవార్లకు చీరలు సమర్పించిన అనంతరం ఆమె ములుగులో చీరల పంపిణీ కార్యక్రమానికి హాజరైన, మహిళలకు చీరెలు అందజేశారు. మహిళలకు అత్యంత ఇష్టమైన చీరలను పంచడం ద్వారా తన కార్యక్రమాలను ప్రారంభించే అవకాశం ఇచ్చిన కేసిఆర్‌కు ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ రాష్ట్రంలోని మహిళలందరినీ అక్కాచెల్లెల్లుగా భావించి పండుగపూట ప్రతీ ఆడబిడ్డ కొత్త చీర కట్టుకోవాలని చీరెల అందిస్తున్నారని అన్నారు. మహిళలకే కాకుండా ఆడపిల్లలకు మేనమామలా ఉంటున్నారని అన్నారు. ఏ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రి ఉండదరని, ఇలాంటి సీఎం మనకు దొరకడం అదృష్టమని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారని, కులం, మతం, వర్గం అనే విబేధాలు లేకుండా అందరూ సమానంగా బాగుపడేలానే ఉద్దేశంతో అందరికీ ప్రభుత్వ ఫలాలను కేసీఆర్ అందిస్తున్నారని మంత్రి కోనియారు. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకు సాగునీరుఅ ందించటమే ధ్యేయంగా ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందేలా కాళేశ్వరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేశారని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా రైతులు పంటలకు సాగునీరు వచ్చి రైతులు సంతోషంగా ఉంటారని అన్నారు. రాబోయే కాలంలో కేసీఆర్ చేపట్టే పథకాల ద్వారా తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా నిలుస్తారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కవిత, జెడ్పీ ఛైర్మన్, జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సీఈవోకి రెస్టారెంట్‌లో భయనక అనుభవం

## -ఫేస్‌బుక్‌లో గోడు వెళ్ళబోసుకున్న మహిళ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఆర్ఎన్ఎ): ఉన్నత స్థాయిలో ఉన్న మహిళా ఉద్యోగులకూ పోకీరల నుంచి వేధింపులు తప్పట్లేదు. అలాంటి ఘటన ఒకటి తజాగా దేశరాజధాని లో జరిగింది. దక్షిణ ఢిల్లీలోని ఒక ఖరీదైన బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లిన ఒక కంపెనీ మహిళా సిఇఓకు కొంతమంది అపరిచిత వ్యక్తుల నుంచి భయంకరమైన అనుభవం ఎదురైంది.గ్రేటర్ కైలాష్ పార్ట్ 2లోని ఎం బ్లాక్ మార్కెట్‌లో ఉన్న సైడ్‌కార్ బార్ అండ్ రెస్టారెంట్‌కు ఒక ఇంటీరియర్ డిజైన్ స్టూడియో సిఇఓ శనివారం రాత్రి తన ఇద్దరు స్నేహితురాళ్లతో కలసి వెళ్లారు. ఆ బార్‌లో కూర్చుని ఉండగా తమకు ఎదురైన చేదు అనుభవాన్ని ఆమె తన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. నా వెనుక వైపు కూర్చున్న ఇద్దరు వ్యక్తులలో ఒకడు నా కుర్చీపై తన చేయి వేశాడు. అతని చేయి నా తలకు అత్యంత సమీపంలో ఉండడంతో నా కుర్చీని ముందుకు జరుపుకున్నాను. దీంతో నా వెనుక కూర్చున్న అతను కోపంగా నా కుర్చీని ముందుకు తోసాడు. దీంతో నేను ముందుకు తూలిపడ్డాను. నేను లేచి నిలబడి నా కుర్చీని తోసే అధికారం నీకెక్కడిది అని ప్రశ్నించాను. దాంతో అతను రెచ్చిపోయాడు. కోపంగా నా మీద అరవసాగాడు. తన కాళ్లను అసభ్యంగా చూపుతూ అశ్లీలం పదజాలంతో దూషించసాగాడు. ఆ తర్వాత తన కుడి కాలును నా ముఖం మీదకు సాచుతూ నా కాళ్లను నాకు. నువ్వు నా పనిమనిషిలా ఉన్నావు. మీ దక్షిణ ఢిల్లీ ఆంటీలంతా అంతే అంటూ అసహ్యంగా మాట్లాడసాగాడు. ఇంతలో రెస్టారెంట్ మేనేజర్ వచ్చి ఆ ఇద్దరు వ్యక్తులను తీసుకెళ్లాడు. అయితే మళ్లీ ఐదు నిమిషాలకే వాళ్లిద్దరూ వచ్చేసి మా వెనుకనే కూర్చున్నారు. ఆ తర్వాత దాదాపు అరగంట సేపు మమ్మల్ని వేధించసాగారు. ఇంతలో నా మిత్రురాలు వాళ్లను సెల్‌ఫోన్‌లో ఫోటో తీయడానికి ప్రయత్నించగా అందులో ఒకడు ఆమె వైపు చూస్తూ ముద్దులు విసరసాగాడు. రెస్టారెంట్ మేనేజర్ మాకు ఎంత సహకరించినప్పటికీ వారిని అదుపు చేయడంలో మాత్రం విఫలమయ్యాడు. ఇంతలో మేము పోలీసులకు కాల్ చేయడంతో వారిద్దరూ అక్కడి నుంచి జారుకున్నారు అని ఆమె వివరించారు. కాగా, ఆ మహిళ ఫిర్యాదును నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు డిసిపి(సౌత్) అటుల్ కుమార్ ఠాకూర్ తెలిపారు. సిసిటివి ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నామని ఆయన చెప్పారు.

# ఉద్యోగం పేరుతో రూ.11 లక్షలు టోకరా

## సైబర్ దొంగల ఘరానా మోసం

హైదరాబాద్,సెప్టెంబర్23( ఆర్ఎన్ఎ): ఉద్యోగం వచ్చిందని నమ్మించి ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు రూ.11లక్షలు టోకరా వేశారు. హుమాయున్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ ప్రైవేట్ ఇంటీరియర్స్ కంపెనీలో ఫీల్డ్ సూపర్ వైజర్‌గా ఆరేండ్లు పనిచేశాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో కొన్నాళ్లపాటు చికిత్స తీసుకున్నాడు. అనారోగ్యం కారణంతో పాత ఉద్యోగాన్ని మానేశాడు. ఆరోగ్యం కుదుపటడడంతో ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. దీనిలో భాగంగా నౌకరీ.కామ్, మనోస్టర్.కామ్ వంటి జాబ్ పోర్టల్స్‌లో తన బయోడేటాను అప్‌లోడ్ చేశాడు. ఇంటర్నెట్‌లో ఉద్యోగాల కోసం శోధిస్తున్న క్రమంలో ఫిబ్రవరి 5వ తేదీన నౌకరీ.కామ్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ పూజ అనే పేరుతో ఒక మహిళ మాట్లాడింది. మీకు టెలిఫోనిక్ ఇంటర్వ్యూ ఉంటుందని మాట్లాడి మొదటి రౌండ్‌లో ఆమె కొన్ని వివరాలు అడిగింది, తరువాత టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూ అంటూ పట్నాయర్ అనే వ్యక్తితో మాట్లాడించింది. మీారు ఇంటర్వ్యూలో ఎంపికయ్యారు, ఎల్ అండ్ టీ కంపెనీలో సైట్ కోఆర్డినేటర్ ఉద్యోగమంటూ నమ్మించారు. అయితే ఉద్యోగం రావాలంటే రూ.1500లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించడంతో తక్కువ మొత్తమే కదా అనే ఉద్దేశంతో డబ్బు చెల్లించాడు. రెండు రోజుల తరువాత రూ.80వేలు చెల్లిస్తే.. ఉద్యోగం వస్తుందని, త్వరగా తేల్చుకొని చెప్పాలంటూ ఒత్తిడి తేవడంతో ఆ డబ్బు చెల్లించాడు.

తిరిగి రెండు రోజులకు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.4లక్షలు చెల్లించాలని, ఇదంతా తిరిగి మీారు జాబ్‌లో చేరగానే ఇచ్చేస్తామంటూ నమ్మించడంతో ఆ డబ్బు కూడా చెల్లించాడు. నమ్మకం కుదిరేందుకు ఎల్అండ్‌టీ పేరుతో ఉండే ఒక పేపర్‌పై ఉద్యోగానికి ఎంపికైనట్లు లెటర్ తయారు చేసి, దానిని ఈ-మెయిల్ చేశారు. చెల్లించే ప్రతి పైసా రీఫండ్ అవుతుందంటూ నమ్మిస్తూ శ్రీనివాస్ వద్ద నుంచి రూ.10.90 లక్షలు వివిధ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయిస్తూ వెళ్లారు. తీరా ఇంకా డబ్బు అడుగుతుండడంతో ఇదంతా మోసమని గుర్తించి, సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ రమేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీగా గోదావరి వరద

నిజామాబాద్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): గోదావరి ప్రాజెక్టులలకు వరద భారీగానే వస్తున్నది. ఎగువప్రాంతాల నుంచి ఇన్‌ఎ÷-లో కొనసాగుతుండటంతో ఉత్తర తెలంగాణ వరప్రధాయినీ నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతున్నది. ప్రాజెక్టులోకి 74,000 క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో వచ్చి చేరుతుంది. ఆదివారం సాయంత్రానికి ఐదు టీఎంసీల మేర వరద వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1079.80 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1090 అడుగులు. ప్రస్తుతం ప్రాజెక్టులో 51.86 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 90.31 టీఎంసీలు. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుకు 1,700 క్యూసెక్కులపైగా వరద వస్తున్నదీ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 26 అడుగులకు చేరుకున్నది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తు తున్నది. కిన్నెరసాని రిజర్వాయర్‌కు వరదనీరు వచ్చి చేరుతున్నది

# కొత్త చరిత్ర..సరికొత్త శకం



హ్యూస్టన్‌లోని ఎన్ఆర్‌జీ స్టేడియంలో సభికులకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

హ్యూస్టన్, సెప్టెంబర్ 23: హ్యూస్టన్ వేదిక సాక్షిగా భారత్-అమెరికా సంబంధాల్లో సరికొత్త శకం ఆవిష్కృతమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 50 వేల మందికి పైగా హాజరైన హౌడీ-మోదీ చారిత్రక సదస్సునుద్దేశించి మాట్లాడిన మోదీ ఇరు దేశాల మైత్రి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టడంతో పాటు అన్ని రంగాల్లోనూ బలమైన బంధాన్ని పాదుకొలిపిందన్నారు. తెలుగు, హిందీతో పాటు అన్ని భారతీయ భాషల్లోనూ స్వాగతం పలికిన మోదీ ప్రతి ఒక్కరినీ అలరించారు. సంకల్పంతోనే సిద్ధి అన్న బలమైన నినాదంతోనే భారతావని జాజ్వల్యంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ట్రంప్‌కు ఆహ్వానం పలుకుతూ తొలుత ఆంగ్లంలో మాట్లాడిన అనంతరత వేదికపైకి వచ్చి హిందీలోనే తన ప్రసంగాన్ని కొనసాగించారు. భారత దేశంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. మొదటి ఐదేళ్ళ అధికారంలో ఉన్న తాము అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకున్నామని, అనంతరం కూడా రెండో సారి తిరుగులేని మెజారిటీతో చేపట్టి అనేక సంచలన నిర్ణయాలను అమలు చేశామన్నారు. జన్-?ధన్‌తో సహా తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను భారత్ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయన్నారు. భిన్న మతాలు, భాషలు కలిగిన భారత్ భిన్నత్వంలో ఏకత్వానికి తిరుగు లేని ప్రతీక అని మోదీ స్పష్టం చేశారు. నవ భారత నిర్మాణానికి ప్రతి భారతీయుడు రాత్రింభవళ్ళు కృషి చేస్తున్నారని అనేక రకాలుగా పరివర్తనను పాదుకొల్పుతున్నాడని మోదీ స్పష్టం చేశారు. ఆర్థిక సరళీకరణ దిశగా తాము తీసుకున్న నిర్ణయాలు అనేక రకాలుగా దేశానికి పుష్టిని అందించాయని, అలాగే ఆన్‌లైన్ సేవలు కూడా అనూహ్య రీతిలో విస్తృతమయ్యాయని మోదీ తెలిపారు. సులభతర వ్యాపార, వాణిజ్యం దిశగా తాము తీసుకున్న నిర్ణయాల వల్ల అనేక రకాలుగా సౌలభ్యం పెరిగిందని కంపెనీల రిజిస్ట్రేషన్లు కూడా అతితక్కువ వ్యవధిలోనే జరుగుతున్నాయని మోదీ వెల్లడించారు. ఇటీవల భారత్‌లో జరిగిన

ఎన్నికలు దేశ ప్రజాస్వామ్య విశిష్టతను యావత్ ప్రపంచానికి చాటి చెప్పాయన్నారు. అమెరికా జనాభాకు రెండింతల సంఖ్యలో అంటే 61 కోట్ల మంది భారతీయులు ఈ ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని మోదీ తెలిపారు. అత్యంత చౌకగా భారత దేశంలో డేటా అందుబాటులోకి వస్తున్నదని, అన్ని రంగాల్లోనూ అమలులోకి వచ్చిన ఆన్‌లైన్ సేవలతో పరిపాలన కూడా అనూహ్య వేగాన్ని పుంజుకున్నదని మోదీ తెలిపారు. గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి బహిరంగ మల విసర్జనకు భారత్ పూర్తి స్థాయిలో స్వస్తి పలుకుతుందని హర్షధ్వనుల మధ్య ప్రకటించారు. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370 రాజ్యాంగ అధికరణ రద్దు ద్వారా ఆ రాష్ట్ర ప్రజలకు నవశకాన్ని అందించామని మోదీ తెలిపారు. ఈ అధికరణ వల్లే జమ్మూ-కాశ్మీర్‌లో ఉగ్రవాదం, వేర్పాటువాదం వెర్రితలలు వేశాయన్నారు. ప్రజలు అఖండ రీతిలో ఇచ్చిన తీర్పుతోనే వారి ఆశలు, ఆకాంక్షలకు అద్దం పడుతూ ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకోగలిగామన్నారు. వ్యక్తిగతంగా మోదీ ఓ వ్యక్తి మాత్రమేనని, అఖండమైన భారతీయుల మద్దతుతోనే తిరుగులేని రీతిలో ముందుకు సాగుగలుగుతున్నామని మోదీ అన్నారు.

ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చి దిద్దేందుకు తమ ప్రభుత్వం కంకణబద్ధంగా పని చేస్తున్నదని మోదీ తెలిపారు. గత ఐదేళ్ళుగా ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం నెలకొన్నా భారత్ వృద్ధి రేటు బలంగా, స్థిరంగా సాగిందని మోదీ ఈ సందర్భంగా తెలిపారు.

# అద్వితీయ బంధం మనది..

హ్యూస్టన్, సెప్టెంబర్ 23: గతంలో ఎన్నడూ లేని రీతిలో భారత్-అమెరికా మధ్య సంబంధాలు మరింతగా బలోపేతం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. హ్యూస్టన్‌లో జరిగిన హౌడీ-మోదీ మెగా కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్ ఉభయ దేశాలూ ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పని చేస్తున్నాయని తెలిపారు. ఇక్కడ ఎన్ఆర్‌జీ స్టేడియంలో 50 వేలకు పైగా ఇండో-అమెరికన్లు పాల్గొన్న ఈ సదస్సులో మాట్లాడిన ట్రంప్ భారత్‌లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బలమైన, అభివృద్ధి పథంలో పరుగెడుతున్న భారతావని ఆవిష్కృతమవుతోందన్నారు. మోదీ సారథ్యంలో భారత్ మరింత శక్తిని పుంజుకున్న విషయాన్ని యావత్ ప్రపంచం గమనిస్తున్నదని ట్రంప్ అన్నారు. ఇరు దేశాలు గతంలో ఎన్నడూ

లేని రీతిలో సిరి సంపదలతో తులతూగే రీతిలో ప్రధాని మోదీతో కలిసి పని చేయాలని తాను భావిస్తున్నానని ట్రంప్ అన్నారు. అమెరికా అభివృద్ధిలో ఇండో-అమెరికన్ల కృషి ఎంతో ఉందని నిరంతరం కష్టపడి పని చేసే మనస్వత్వం అని ట్రంప్ ప్రశంసించారు. ఇరు దేశాల మధ్య భద్రతా పరమైన బంధాన్ని కూడా పెంపొందించుకునేందుకు త్వరలోనే పలు రక్షణ ఒప్పందాలు కుదరబోతున్నాయని ట్రంప్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసలతో ముంచెత్తిన మోదీ ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. మోదీ తనకు అత్యంత సన్నిహితుడు, స్నేహితుడని ట్రంప్ అభివర్ణించారు. మొదట మాట్లాడిన ట్రంప్ ప్రసంగాన్ని మోదీ ఆద్యంతరం ఆసక్తిగా తిలకించారు. ట్రంప్ తన ప్రసంగంలో ఇరు దేశాల ఆర్థిక, వాణిజ్య సంబంధాలతో పాటు ప్రజాపరంగా పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని కూడా ప్రశంసించారు. ఇస్లామిక్ ఉగ్రవాదం నుంచి భారతీయ అమెరికన్లకు అన్ని విధాలా రక్షణ కల్పిస్తున్నామని ట్రంప్ తెలిపారు. ఇరు దేశాలకు సరిహద్దు భద్రత అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. 'నేను నా భారతీయ కుటుంబానికి మిమ్మల్ని పరిచయం చేస్తున్నాను' అని ట్రంప్‌ను ఇండో-అమెరికన్లకు పరిచయం చేశారు. ట్రంప్ అత్యంత ప్రత్యేకమైన వ్యక్తి అని అమెరికాను అన్ని రంగాల్లో ప్రభావితం చేశారని అన్నారు. అమెరికా అధ్యక్ష పదవి చేపట్టడానికి ముందే ట్రంప్ గురించి ప్రపంచమంతా తెలుసునని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ రాజకీయాలపై ఎప్పుడు చర్చ జరిగినా ఆయన పేరు అనివార్యంగా ప్రస్తావనకు వస్తుందన్నారు. తాను ట్రంప్‌ను ఎప్పుడు కలుసుకున్నా ఎంతో ఉత్సాహభరితంగా, ఆ ప్లో ద బ రి తం గా, స్నేహపూర్వకంగానే సంభాషణలు జరిగాయని మోదీ తెలిపారు. అనంతరం వేదిక దిగిన మోదీ ట్రంప్ ప్రసంగాన్ని సభికుల్లో కూర్చొని ఆలంకించారు.

# కలిసి పనిచేద్దాం




హ్యూస్టన్, సెప్టెంబర్ 23: పెరుగుతున్న భారత ఇంధన అవసరాలను తీర్చుకునే అంశంపై అమెరికాకు చెందిన చమురు, సహజ వాయువు కంపెనీల సీఈఓలతో ప్రధాని నరేంద్ర మోదీ విస్తృత చర్చలు జరిపారు. ఈ రెండు రంగాల్లో ఉన్న అవకాశాలను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలన్న దానిపై వీరితో ఆయన చర్చించారు. ఇంధన భద్రత, పరస్పర పెట్టుబడులను పెంపొందించుకోవడంపై ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఉభయతారకమైన రీతిలో మంతనాలు జరిగాయని అనంతరం మోదీ ట్వీట్ చేశారు.

హ్యూస్టన్ వచ్చి, ఇంధన అంశంపై చర్చించకుండా ఉండడం అసాధ్యమేనని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా ఇంధన రంగానికి చెందిన సీఈఓలందరితోనూ తాను జరిపిన చర్చలు సుహృద్భావ రీతిలో సాగాయని, వారం రోజుల పాటు అమెరికా పర్యటనలో భాగంగా మోదీ ఇక్కడకు వచ్చారు. ఈ సమావేశంలో 17 అంతర్జాతీయ ఇంధన కంపెనీల సీఈఓలు పాల్గొన్నారని భారత విదేశాంగ విభాగం ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు.

ఈ 17 కంపెనీలు 150 దేశాల్లో పనిచేస్తున్నాయని, వీటి ఉమ్మడి విలువ ట్రిలియన్ డాలర్లకు పైనేనని ఆయన వివరించారు. ఈ కంపెనీలన్నింటిలోనూ భారత్‌కు ఏదో ఒకవిధమైన సంబంధం ఉందని ఆయన తెలిపారు. మోదీ సమక్షంలోనే ఈ సందర్భంగా అమెరికా ఇంధన కంపెనీ హెలారియన్‌తో భారత్‌కు చెందిన పెట్రోనెట్ ఎల్అండ్‌జీ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు కంపెనీలు 2020 మార్చి 31 నాటికి ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకుంటాయి.

ఈ సమావేశంలో మాట్లాడిన అమెరికా సీఈఓలు భారత్‌లో ఇటీవల వచ్చిన మార్పులను ప్రశంసించారు. కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించడంతోపాటు ఆర్థిక వ్యవస్థను సంస్కరించడం మరింతగా ద్వారాలు తెరవడం వంటి మోదీ సర్కారు నిర్ణయాలను వీరు ప్రధానంగా ప్రస్తావించారని రవీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సీఈఓలు భారత్ ప్రధాని మోదీకి కొన్ని సూచనలు చేశారని, వాటన్నింటిపైనా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

# మోదీ దేశ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేశారు: అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ఖ్యాతిని ప్రపంచానికి తెలుపుతున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మోదీ అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. నిన్న రాత్రి హ్యూస్టన్‌లో జరిగిన 'హౌడీ మోదీ' బహిరంగ సభ గురించి అమిత్ షా ట్విట్టర్ ద్వారా తన అభిప్రాయాను తెలిపారు. మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వివిధ దేశాలతో మంచి స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నారనీ, అమెరికాతో ప్రత్యేక అనుబంధం పెనవేసుకుందని ఆయన అన్నారు. నిన్నటి వేదికే ఇందుకు నిదర్శనమనీ, ప్రపంచ వ్యాప్తంగా మోదీకి లభిస్తున్న ఆదరణను భారత ప్రజలకు దక్కుతున్న గౌరవంగా ఆయన అభివర్ణించారు. అమెరికా గడ్డపై బలమైన భారత్‌ను మోదీ ఆవిష్కరించారనీ, ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ రాజకీయ చరిత్రలో హౌడీ మోదీ కార్యక్రమం నిలిచి పోతుందనీ, ప్రపంచ రాజకీయ చరిత్రలో ఈ ఘటన చెరగని ముద్ర వేస్తుందన్నారు.

రెండు బలమైన ప్రజాస్వామ్య దేశాల నేతలు తమ కలల్ని, ఆలోచనలను పంచుకున్నారనీ, ప్రపంచ సౌభాగ్యం కోసం ఇరు దేశాల నాయకులు కృషి చేస్తున్నారని కొనియాడారు. దేశ భద్రత, ఐక్యత కోసం మోదీ రాజీ లేని పోరాటం చేస్తున్నారనీ, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 'హౌడీ మోదీ' కార్యక్రమం ఇరుదేశాల మైత్రిని ఇనుమడింపజేసిందనీ, దీనికి కారకులైన ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# బాలాకోట్‌లో 500 మంది ఉగ్రవాదులు : ఆర్మీ చీఫ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23: బాలాకోట్ మళ్లీ పుంజుకున్నది. అక్కడ సుమారు 500 ఉగ్రవాదులు ఉన్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ తెలిపారు. ఇవాళ చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుల్వామా దాడి తర్వాత భారత దళాలు పాక్‌లోని బాలాకోట్ ఉగ్రస్థావరాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అయితే అదే స్థావరం వద్ద మళ్లీ ఉగ్రవాదులు తమ కార్యకలాపాలను పునరుద్ధరించినట్లు ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు. బాలాకోట్ స్థావరంపై మరోసారి సర్జికల్ దాడి చేసినా ఆశ్చర్యం లేదని రావత్ తెలిపారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని, బాలాకోట్ దాడి కన్నా మరింత బలమైన సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సుమారు 500 మంది ఉగ్రవాదులు ఇండియాలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. కశ్మీర్‌లో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. వ్యాలీలో ఉగ్రవాదులు అల్లర్లు సృష్టించాలనుకుంటున్నారన్నారు. కశ్మీర్‌లో విధించిన ఆంక్షలను నెమ్మదిగా ఎత్తివేస్తామన్నారు.

# మెరుగైన వైద్యం అందించాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 23: గ్రామీణ ప్రాంతమైన శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ గ్రామ సమీపంలో స్వర్ణ భారతీ ట్రస్ట్ ద్వారా నిరుపేద ప్రజలకు ఉచితంగా వైద్యం అదించడం ఎంతో హర్షనీయమని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం ముచ్చింతల్ గ్రామ సమీపంలోని స్వర్ణ భారతీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని, రైతు నేస్తం కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరిని ఆరోగ్యమస్తు, ఆయుష్మాన్‌భవ అని దీవించ గలిగే గొప్ప సంస్కారం నేర్పింది. మన శరీరాన్ని దృఢంగా ఉంచుకొగలిగినప్పుడే మన పనులు చకచకా చేసుకుంటామని, విదేశీ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్ ఎక్కువ తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని అన్నారు. గవర్నర్ మాట్లాడుతూ స్వర్ణ భారతి అందిస్తున్న సేవలు ఎంతో బాగున్నాయని కొనియాడారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత మందులు అందజేయడం హర్షనీయని అన్నారు. రైతు లేనిదే దేశం లేదని వారి ప్రతిభను ప్రతి ఒక్కరు గుర్తించాలని, ప్రతి ఒక్కరు వ్యవసాయంలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.జివి రామాంజనేయులు, డాక్టర్ బాబురావు నాయడు, డాక్టర్ భాస్కర్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, కామినేని శ్రీనివాస్‌రావు హాజరయ్యారు.

ఇదే కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ముప్పవరపు ఫౌండేషన్ రైతు నేస్తం సంస్థ సంయుక్త నిర్వహణలో జరిగిన రైతు నేస్తం పురస్కారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ప్రాధాన్యత క్రమంలో తొలిస్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం అనేది భారతీయ సంప్రదాయం వ్యవసాయ పద్ధతని, పురుగుల మందుల దుష్ప్రభావం నుంచి వినియోగదారులను కాపాడే ఈ విధానం అత్యుత్తమ వ్యవసాయ విధానంగా భావిస్తానన్నారు. రైతు నేస్తం జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జీవీ రామాంజనేయులు, కృషి రత్న పురస్కారం అందుకున్న ఐఏఎస్ అధికారి డాక్టర్ టీ బాబూరావు నాయుడును ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

# నెహ్రూ తప్పిదమే కారణం



ముంబయి, సెప్టెంబర్ 23: ఆక్రమిత కాశ్మీర్ ఏర్పడ్డానికి తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ తప్పిదమే కారణమని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. పాకిస్తాన్‌తో అప్పట్లో జరుగుతున్న యుద్ధాన్ని మధ్యలోనే ఆపి నెహ్రూ కాల్పుల విరమణ ప్రకటించారని, ఆయన ఆ నిర్ణయం తీసుకోకుండా ఉండి వుంటే ఆక్రమిత కాశ్మీర్ ఊసే ఉండేది కాదని అమిత్ షా అన్నారు. నిన్న మొన్నటి వరకు భారత్‌లో కాశ్మీర్ పూర్తి స్థాయిలో విలీనం కాకపోవడానికి నెహ్రూ వ్యవహరించిన తీరే కారణమని అమిత్ షా తెలిపారు. అప్పట్లో ఈ అంశాన్ని హోం మంత్రిగా ఉన్న సర్దార్ పటేల్‌కు అప్పగించి వుంటే ఆయన సరైన నిర్ణయం తీసుకుని ఉండేవారని ఆదివారం నాడు ఇక్కడ జరిగిన ర్యాలీలో అమిత్ షా అన్నారు. అప్పట్లో నెహ్రూ ఐరాస చార్టర్‌లోని 35వ అధికరణ కింద సమితిని ఆశ్రయించారని, అయితే 51వ చార్టర్ కింద అభ్యర్థన చేసివుంటే ఆక్రమిత కాశ్మీర్ కూడా భారత్‌లోనే ఉండి ఉండేదని అమిత్ షా అన్నారు. 1950లో సర్దార్ పటేల్ మరణం తర్వాత షేక్ అబ్దుల్లాతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, 370 ప్రత్యేక అధికరణ రావడానికి ఆ ఒప్పందమే కారణమని అమిత్ షా అన్నారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ నుంచి భారత్ వచ్చిన వారిలో మన్మోహన్ సింగ్, ఐ.కే గుజ్రాల్‌లు ప్రధాన మంత్రి పదవులు చేపట్టారని, అలాగే ఎల్.కె అద్వానీ ఉప ప్రధానిగా పనిచేశారని అమిత్ షా అన్నారు. కానీ, 370 అధికరణ రద్దు చేసే వరకు కాశ్మీర్ వెళ్లిన ఎవరికీ ఓటు హక్కే లేకుండా పోయిందన్నారు. ఇప్పుడా ప్రజలు హాయిగా తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవచ్చు అన్నారు. వచ్చే నెలలో జరుగుతున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని జరిగిన ఈ ర్యాలీలో 370 అధికరణ రద్దును అమిత్ షా ప్రధానంగా ప్రస్తావించారు. 'ఈ అధికరణ రద్దుతో బీజేపీ బాధ్యత ముగిసినట్టు కాదు, నిజానికి ఇప్పటి నుంచే మొదలైనట్టు..' అని పార్టీ కార్యకర్తలకు ఆయన స్పష్టం చేశారు. జాతీయ వాదం, అభివృద్ధి ప్రాతిపదికగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే బీజేపీ లక్ష్యాలని ఆయన ప్రకటించారు. 370 అధికరణ రద్దును కాంగ్రెస్, ఎంసీపీలు నిస్సిగ్గుగా వ్యతిరేకిస్తున్నాయని అమిత్ షా విమర్శించారు. వచ్చే నెల 21న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవిసే వస్తారన్న ధీమాను అమిత్ షా వ్యక్తం చేశారు. కాశ్మీర్ ప్రత్యేక హోదా రద్దు చర్చతోనే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మొదలు కావడం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయానికి రాజకీయ రంగును ఆపాదించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, కానీ తాము కాశ్మీర్ ప్రజల సంక్షేమాన్ని అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొనే వ్యవహరించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పనితీరుకు సంబంధించి ముఖ్యంగా సర్జికల్ దాడులపై సాక్ష్యాలు కావాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్న విషయాన్ని అమిత్ షా ప్రస్తావించారు. రాహుల్, ఎన్‌సీపీ నాయకుడు శరద్‌పవార్ ప్రచారానికి వచ్చినప్పుడు 370 అధికరణపై వారి అభిప్రాయాన్ని అడగండి అని ప్రజలను అమిత్ షా కోరారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

హైదరాబాద్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వచ్చే నాలుగురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

ఉత్తర కోస్తా, ఆంధ్ర తీరానికి దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు తెలిపింది.

ఇది ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి వైపు తిరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు.

## ఏపీ వార్తలు

# టీటీడీ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం

**- ప్రమాణం చేయించిన జేఈవో బసంత్‌కుమార్**

తిరుమల, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : టీటీడీ పాలకమండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. గరుడాళ్వార్ సన్నిధిలో పాలకమండలి సభ్యులు శ్రీనివాసన్, పార్థసారధి, రమణ మూర్తిరాజు, మురళీకృష్ణ, జూపల్లి రామేశ్వరరావు, నాదెండ్ల సుబ్బారావులతో జేఈవో బసంత్ కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు.

అనంతరం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన అన్నమయ్య భవనంలో పాలకమండలి తొలిస మావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై చర్చ జరిగింది. ప్రమాణ స్వీకారం అనంతరం శ్రీనివాసన్, పార్థసారధి, రమణ మూర్తిరాజు, మురళీకృష్ణ, జూపల్లి రామేశ్వరరావు, నాదెండ్ల సుబ్బారావులు విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. స్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం నాకు కలగటం చాలా సంతోషంగా ఉందన్నారు. నాకు పాలకమండలి సభ్యునిగా అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నా ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా జూపల్లి రామేశ్వరరావు మాట్లాడుతూ.. శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి అనుగ్రహంతో ఈ అవకాశాన్ని కల్పించిన ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. స్వామి వారి అనుగ్రహంతో సామాన్య భక్తులకు సేవ చేసే శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. నిషితారెడ్డి మాట్లాడుతూ.. శ్రీవారి ఆశీస్సులతో నాకు ఈ అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని, భక్తులకు సేవలందించేందుకు ఆ భగవంతుడి ఆశీస్సులు ఎప్పుడూ నాపై ఉండాలని స్వామి వారిని ప్రార్థించానని అన్నారు. అనంతరం నాదెండ్ల సుబ్బారావు మాట్లాడుతూ.. విశాఖ శారదా పీఠాధిపతులు చెప్పడం.. నాకు ఈ అవకాశం కల్పించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కాలినడక మార్గంద్వారా వచ్చే భక్తులకు, సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. టీటీడీ పాలక మండిలలో రెండవసారి చోటు దక్కడం మా అదృష్టంగా భావిస్తున్నానని మేడా మల్లికార్జున్ రెడ్డి పేర్కొన్నారు. స్వామి వారికి సేవ చేసే భాగ్యం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య భక్తులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని, దేవస్థానంలో ఎటువంటి అవినీతికి తావులేకుండా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.



# గుట్టుగా..గుట్టలుగా...గుట్కా!

గుంటూరు, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): గుంటురూ జిల్లా గుట్కా హబ్‌గా మారింది. జిల్లాలో యధేచ్ఛగా నిషేధిత గుట్కాలు లభ్యమవుతున్నాయి. నిషేధం మాటున కొందరు గుట్కా వ్యాపారులు కోట్లు పోగేసుకుంటున్నారు. ఇటు పోలీసులు, అటు విజిలెన్స్ అధికారులు నిఘా ఎక్కువవ్వడంతో వ్యాపారులు కొత్త పంథాల్లో గుట్కా రవాణా చేస్తున్నారు. జిల్లాలోని గుంటూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, తెనాలి సహా వివిధ ప్రాంతాలకు కర్ణాటకలోని బెంగళూరు, బళ్లారి, హుబ్లీ, చెన్నై, హైదరాబాద్‌ల నుంచి గుట్కా రవాణా సాగుతోంది. ఆయా నగరాల నుంచి హోల్‌సేల్‌గా నిషేధిత గుట్కా తెప్పించి గుట్టుగా జిల్లాలోని సిగరెట్, కిల్లి, చిల్లర కొట్లకు రీటైల్‌గా విక్రయిస్తున్నారు.

రైల్వే, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థల ద్వారా రకరకాల పద్ధతుల్లో జిల్లాకు ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి గుట్కా రవాణా చేస్తున్నారు. చిన్న చిన్న బస్తాలుగా చేసి అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో గుంటూరుకు చేరుకునే రైళ్లలోనే ఎక్కువగా గుట్కా పార్సిల్ చేస్తుంటారు. పగటి వేళల్లో రైల్వే కూలీలను మేనేజ్ చేసుకుని వాటిని పొద్దు పోయే వరకూ అక్కడే ఉంచుతున్నారు. ఈ తరహాలో రైల్వే పార్సిల్ ద్వారా వచ్చిన తంబాకును రవాణా చేస్తున్న వ్యక్తులను గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలో గత జూలైలో కొత్తపేట పోలీసులు పట్టుకున్నారు. అయితే ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పార్సిల్‌లో వచ్చిన నిషేధిత గుట్కాలను రహస్య స్థావరాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి బైకులపై షాపులకు రవాణా చేస్తున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల ప్రాంతాల్లో టీడీపీ నాయకులు గుట్కా దందా కొనసాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి గుట్కాలను షాపులకు కార్లు, బైక్‌లు, అశోక్ లైలాండ్, అప్పి ఆటోల్లో గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. గుంటూరు అర్బన్ పరిధిలోని ఎన్‌హెచ్ 66 పక్కన ఉన్న ఏటుకూరు రోడ్డు, నల్లచెరువు, కాకాని, నగరాలు సహా పలు ప్రాంతాల్లోని గోడౌన్‌లలో రాత్రికి రాత్రికి రహస్యంగా ఎంసీ, ఖలేజా వంటి గుట్కా ఉత్పత్తులను తయారు చేస్తున్నట్టు సమాచారం. డిమాండ్‌ను బట్టి అప్పటికప్పుడు తయారు చేసి సరుకును బయటికి పంపి మిషన్‌లను విడదీసి భద్రపరుస్తున్నట్టు తెలుస్తోంది. తెలిసినా గప్‌చుప్. గుట్కా వ్యాపారంపై పోలీస్, విజిలెన్స్ సిబ్బందికి పూర్తి స్థాయిలో సమాచారం ఉంటోంది. అయితే ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియనివ్వకుండా గుట్కా మాఫియా వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారు. తెనాలి, నరసరావుపేట, గుంటూరు సహా పలు సబ్ డివిజన్‌లలో నడుస్తున్న గుట్కా దందాలో కింది స్థాయి పోలీస్ సిబ్బందికి హస్తం ఉన్నట్టు పోలీస్ వర్గాల్లోనే చర్చలు నడుస్తోంది.

# చంద్రబాబు ఇల్లు ఖాళీ చేయాల్సిందే

**- సీఎంగా పనిచేసిన వ్యక్తి చట్టాలను ఉల్లంఘించటం సరికాదు**

**- గ్రామ సచివాలయ పరీక్షల్లో ఎలాంటి తప్పుజరగలేదు**

**- ఇదంతా బాబు కావాలని ఆడిస్తున్న డ్రామానే**

**- ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ**

అమరావతి, సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : కరకట్టపై చంద్రబాబు నివాసముంటున్న ఇల్లు అక్రమ నిర్మాణమని, ఆయన ఆ ఇంటిని ఖాళీ చేయాల్సిందేనని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కరకట్టపై ఉన్న అక్రమ కట్టడాలకు నోటీసులు ఇవ్వడం జరిగిందని, లింగమనేని రమేశ్‌కు సంబంధించిన ఇంటిలో టీడీపీ అధినేత చంద్రబాబు నివాసం ఉంటున్న విషయం తెలిసిందే అని అయన అన్నారు. ఇప్పటికే నోటీసు కూడా ఇచ్చామన్నారు. భూమి హక్కుదారుడితో పాటు అందులో నివాసం ఉంటున్న వారికీ నోటీసు ఇవ్వాల నేది కోర్టు నిబంధన అని బొత్స వెల్లడించారు. మొండిగా అక్కడే ఉంటున్నారని, ఏడు రోజుల్లో తొలగించాలని.. లేనిపక్షంలో ప్రభుత్వమే తొలగిస్తుందని ఫైనల్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి అక్రమ కట్టడాలను అధికారులు, సిబ్బంది కూల్చివేస్తున్నారని వెల్లడించారు. కరకట్ట లో-లెవల్ ఏరియాలో ఉందని, నిబంధనల ప్రకారం ఇక్కడ ఉండటానికి వీలు లేదని మంత్రి బొత్స వివరించారు. ల్యాండ్ పూలింగ్‌లో తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ స్థలం అని చంద్రబాబు గతంలోనే వెల్లడించిన విషయాన్ని గుర్తు చేశారు. ల్యాండింగ్ పూల్‌లో భవనం ఇచ్చినట్లు లింగమనేని రమేశ్ చెప్పారని.. ఏది ఏమైనా అది అక్రమ కట్టడం అని తేల్చిన విషయాన్ని మంత్రి బొత్స పునరుద్ఘాటించారు. చంద్రబాబు అక్రమ కట్టడంలో నివాసం ఉండడం మంచిది కాదని హితవు పలికారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి చట్టాలను ఉల్లంఘించడం సరికాదని మంత్రి సూచించారు. ఎంతటి వారైనా, ఎవరైనాసరే అక్రమ కట్టడం ఖాళీ చేయాల్సిందేనని హెచ్చరించారు. మరోవైపు గ్రామ సచివాలయాల్లో వస్తున్న విమర్శలపై మంత్రి స్పందించారు. పరీక్షల్లో ఎలాంటి తప్పులు జరగేలేదని స్పష్టం చేశారు. చంద్రబాబు కావాలనే కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తీహార్ జైలుకు వెళ్లిన సోనియా, మన్మోహన్

హైదరాబాద్, సెప్టెంబర్23: ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న విషయం తెలిసిందే.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఇవాళ ఉదయం తీహార్ జైలుకు వెళ్లి చిదంబరాన్ని పరామర్శించారు. దీంతో తమ పార్టీ నేతల పట్ల తాము అండగా ఉంటామన్న సంకేతాన్ని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా వినిపించింది. ఆగస్టు 21వ తేదీన చిదంబరాన్ని అరెస్టు చేశారు. సోనియా, మన్మోహన్ వచ్చి తనను కలవడం గౌరవంగా భావిస్తున్నట్లు ట్వీట్ చేయాలని తన కుటుంబసభ్యులకు తెలిపినట్లు చిదంబరం వెల్లడించారు. ఐఎన్ఎక్స్ మీడియా సంస్థలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించేందుకు లంచం తీసుకున్నట్లు చిదంబరంపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో నేత డి.శివకుమార్ కూడా జైలులో ఉన్నారు. ఆయన్ను కూడా కాంగ్రెస్ టాప్ నేతలు కలుసుకునే వీలు ఉన్నది.

# ప్రాంతీయ పార్టీలు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక



హైదరాబాద్, సెప్టెంబర్ 23: ప్రాంతీయ పార్టీలు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ప్రాంతీయ పార్టీల వల్లే రాష్ట్రాలు సర్వోతోముఖాభివృద్ధి చెందుతున్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆదివారం అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై జరిగిన చర్చకు ఆయన బదులిస్తూ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తీర్మానం చేసుకుని రాజ్యాంగ బద్ధంగా టీఆర్ఎస్‌లో విలీనమయ్యారన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విడివిడిగా తమ పార్టీలో చేరలేదన్నారు. అవసరమైతే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తామని విలీనమైన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు చెప్పారన్నారు. టీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తనకు తానుగా చేర్చుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి నైతికత గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా విధ్వంసపాత్ర పోషించిందన్నారు. గోవాలో పది మంది కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలను బీజేపీ విలీనం చేసుకుందన్నారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆరుగురున్న బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యేలను తమ పార్టీలో విలీనం చేసుకుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యసభకు చెందిన నలుగురు ప్రాంతీయ పార్టీ ఎంపీలను ఉపరాష్ట్రప్రతి, పార్టీ వర్కింగ్ అధ్యక్షుడి సమక్షంలో బీజేపీలో చేర్చుకుందన్నారు. సమైక్య రాష్ట్రంలో 26 మంది ఎమ్మెల్యేలు తమ పార్టీకి ఉంటే, అప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించలేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై తాను కుండబద్ధలు కొట్టినట్లు చెబుతున్నానని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు ఫిరాయింపు అని ఎలా మాట్లాడుతున్నారని అడిగారు. ప్రతి రాష్ట్రానికో రాజ్యాంగం ఉంటుందా అన్నారురు. అబద్ధాలు చెప్పే కర్మ తమకు పట్టలేదన్నారు.

ఈ సందర్భంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క లేచి కేసీఆర్ వ్యాఖ్యలకు అభ్యంతరం తెలిపారు. తాము ఎప్పటకప్పుడుస్పీకర్‌కు పిటిషన్లు ఇచ్చామన్నారు. కేసీఆర్ ఘాటుగా బదులిస్తూ గాలిలో పిటిషన్లు ఇచ్చారా అన్నారు. 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒకటై తీర్మానం చేసుకుని టీఆర్ఎస్‌లో విలీనమయ్యారన్నారు. కాంగ్రెస్ నేతలకు ఏ అంశంపైన అవగాహన లేకుండా మాట్లాడడం అలవాటన్నారు. ప్రతిపక్షపార్టీ నేతలకు ఏ అంశంపై ఎలా మాట్లాడాలో తెలియదన్నారు.తాను ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం ప్రధానాధికారితో తప్ప మరెవరితో మాట్లాడలేదని, చివరకు వ్యక్తిగత సిబ్బందితో కూడా అంటీముట్టనట్లు ఉన్నానని, ప్రగతిభవన్‌లో కార్యాలయం వైపు కూడా రాలేదన్నారు. అధికారులను నమ్ముకుంటే, మాట్లాడితే ఓట్లు వస్తాయా అని అన్నారు. పక్కరాష్ట్రంలో ఎన్నికల సమయంలో స్కీంలు ప్రవేశపెట్టి దెబ్బతిన్నారన్నారు. కేసీఆర్ దుకాణం బంద్ అవుతుందని 2014 ఎన్నికల్లో కూడా చెప్పారని, కాని ప్రజలు తమ పాలనకు మెచ్చి వరుసగా రెండుసార్లు పెద్ద మెజారిటీతో సీట్లు ఇచ్చారన్నారు.

# తెలంగాణ చరిత్ర తరగని గని




సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ

కరీంనగర్, సెప్టెంబర్ 23: వేలాది సంవత్సరాలుగా తిరగేసినా తరగని గని లాంటి చరిత్ర తెలంగాణ ప్రాంతానికి ఉందని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గత మూడు రోజులుగా కరీంనగర్‌లో జరుగుతున్న తెలంగాణ వైభవం కార్యక్రమంలో ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ విదేశీ, వలస పాలనలో మన సంస్కృతిపై లెక్కలేనన్నీ దాడులు జరిగాయని, పూడ్చుకోలేనంత నష్టం జరిగినా ఓర్చుకున్న పుణ్యభూమి మనదేనన్నారు. ప్రజలెన్ని బాధలు అనుభవించినా బయటకు చెప్పుకోలేదని, సిరియా వంటి దేశాల్లో స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలు వింటున్నామని తెలంగాణలో కూడా ఇలాంటి అకృత్యాలెన్నో ప్రజలపై జరిగాయని అన్నారు. రామప్ప వంటి ఆలయాలు అద్భుత శిల్ప కళల విధ్వంసం, నేలమట్టమైన కోటలు, రాజమందిరాలు మనకు సాక్ష్యమని, పూర్వీకులు ఇక్కడి నుండి వలసలు వెళ్లారన్నారు. 500 ఏళ్ల చరిత్ర తెలంగాణకు ఉన్నట్లు మనకు ఆధారాలు ఉన్నాయని, ఇనుము పనిముట్లు, కత్తులు, ఆయుధాల తయారీ, 400 ఏళ్ల క్రితంవి పురావస్తు శాఖ తవ్వకాల్లో దొరికాయని, శతాబ్ధాలు పాలించినా రాజవంశాలు ఆ ఘనత మరింత పెంపొందించారని, శాతవాహనులు, వాకటకాలు, రాష్ట్రక్రూటులు, చాళుక్యులు ఇక్కడ రాజ్యవేలారని, ఎలగందుల సమీపంలో కోటిలింగాల,కాకతీయ సామ్రాజ్యం గణపతి దేవుడు ఏనుగులపై ఆహారపదార్థాలు పంపించి ప్రజలను కరవు నుంచి కాపాడారన్నారు. 30ఏళ్ల స్థిరమైన పాలన అందించి రాణిరుద్రమ దేవి భారతదేశచరిత్రలో మొదటి రాజ్యాధినేతగా నిలిచి వీరమరణం పొందారని అన్నారు. ప్రతాపరుద్రుడు 40 ఏళ్లు పాలించగా,ఆ తరువాత అక్కన్న, మాదన్న, రామదాసు తెలంగాణ సంస్కృతి కాపాడారన్నారు. సాహిత్యంలో బమ్మెరపోతన, మల్లినాథ సూరి, పాల్కురికి సోమనాథుడు, కంచెర్ల గోపన్న, జగన్నాథ పండితరాయలు, మల్లియ రేచన్న, గోన బుద్దారెడ్డి మొదలైన కవులు ప్రపంచానికి మన చరిత్ర చాటిచెప్పారన్నారు. తెలుగు భాషకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చిన నేల మనదని భక్త రామదాసు భద్రాచలంలో దివ్యమైన ఆలయాన్ని నిర్మించి కీర్తనలు, గీతాలతో ప్రజల ఆదరణ పొందారన్నారు. తెలంగాణ గడ్డలో శైవం, వైష్ణవం, శాక్తం, జైనం, బౌద్ధం ఇంకా ఎన్నో మతాలు ఉన్నత శిఖరాలు చేరాయని, యాదగిరి నారసింహుడు, భద్రగిరి రాముడు, రామప్ప, అలంపూర్, కాళేశ్వరం, వేములవాడ, బాసర,?భద్రకాళి, కొలనుపాక, నాగార్జున కొండ ఇలా అన్నీ మతాలు శాంతి సామరస్యంతో జీవించిన గొప్ప నేల ఇది అని తెలిపారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలో వందల ఏళ్లుగా సమ్మక్క - సారలమ్మ జాతర ప్రపంచ రికార్డ్, 70 వేల దేశాల జనాభా నాగోబజాతర కొమురవెల్లి మల్లన్న, ఏడు పాయల బోనాలు తెలంగాణ సంస్కృతి విశిష్టత గుర్తు చేస్తాయన్నారు. హైదరాబాద్‌కు భాగ్యనగరం అనే పేరు ఊర్కేరాలేదని, వజ్ర వైడ్యూరాలన్నీ విదేశీయులంతా కొల్లగొట్టుకుపోయారని బ్రిటీష్ రాజుల దగ్గర కోహినూర్ వజ్రం వరంగల్ భద్రకాళి ఆలయం నుంచి దోచుకున్నదేనని, నూర్-అల్-ఐన్, దరియా-ఏ-నూర్ వెలకట్టలేని వజ్రాలను మన నేల పోగొట్టుకుందన్నారు. ఖనిజ సంపద నాణ్యమైన ముత్యాలకు, వజ్రాలకు, పోచంపల్లి, సిరిసిల్ల, గద్వాల చేనేత వస్త్రాలు దేశమంతా ప్రసిద్ధి అని, అగ్గిపెట్టెలో, ఉంగరంలో పట్టే చీరలు నేసిన కార్మికులను కన్న గడ్డ ఇదన్నారు. రామప్పలో అప్పటి వస్త్రధారణ, నాటి డిజైన్లు, అలంకరణలు, పూర్వీకుల వస్త్రరంగంలో పురోగతి సాధించారన్నారు. ఇంత గొప్ప సంస్కృతి నాశనం చేసి ఈ ప్రాంతాన్ని పాకిస్తాన్‌లో విలీనం చేయాలనే రజాకార్ల కుట్రలు తిప్పికొట్టి భారత్‌లో విలీనమై సర్దార్ పటేల్ ఆపరేషన్ పోలో ద్వారా నిజాం రజాకార్ల రాక్షసత్వాన్ని అణచి నిజమైన స్వాతంత్ర్యం సెప్టెంబర్ 17, 1948లో తెచ్చిన మహానుభావులకు తెలంగాణ రుణపడి ఉంటుందన్నారు. సంస్కృతి లేకపోతే మనం లేమని, నేడు విలువలు క్షీణించి పోకుండా భవిష్యత్ తరాలకు తెలియజేసేలా తెలంగాణ వైభవం చాటి చెప్పడం అభినందనీయమని ఆయన కొనియాడారు. మన సంస్కృతి, వైభవాన్ని కాపాడేందుకు అన్ని విధాల కృషి చేస్తానని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తదితరులున్నారు.

# పర్యావరణ పరిరక్షణలో పొగాకు రైతులు

ఒంగోలు, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : పొగాకు బోర్డు సూచనలకు అనుగుణంగా ఈ ఏడాది పొగాకు రైతులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవుతున్నారు. ప్రకాశం జిల్లాలో వారంరోజులుగా పొగాకు రైతులు ఉండే ప్రతి గ్రామంలో మొక్కలు నాటే పక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఒంగోలు కేంద్రంగా ఉన్న దక్షిణాది నల్లనేలల (ఎస్‌బీఎస్) రీజియన్‌లో ఇప్పటికే లక్షకుపైగా మొక్కలు నాటారు. పొగాకు పంట ఉత్పత్తిలో బ్యారన్‌లో క్యూరింగ్ (కాల్పు) ప్రధానం కాగా అందుకు పెద్ద ఎత్తున కర్ర అవసరం. అందుబాటులో ఉండే వివిధ రకాల చెట్లను నరికి అందుకు ఉపయోగిస్తారు.

రకంగా భారీగా ప్రతి ఏటా చెట్ల నరికివేత జరుగుతుండగా పర్యావరణ పరిరక్షణ కోసం రైతులంతా మొక్కలు నాటాలని , ప్రతి రైతు పది మొక్కలు నాటితేనే 2019-20లో బ్యారన్ లైసెన్సులు పునరుద్ధరణ చేస్తామని బోర్డు షరతు కూడా విధించింది. దీంతో వారంరోజుల్లోనే దాదాపు లక్షకుపైగా మొక్కలు నాటారు. రైతు నాటే మొక్కలను సిబ్బంది ఫొటోలు తీసి లైసెన్సు పునరుద్ధరణకు సిఫార్సు చేస్తున్నారు. కాగా, ఈ పక్రియలో పొగాకు బోర్డు చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు శుక్రవారం కొండపి వేలం కేంద్రంలో పాల్గొన్నారు. అక్కడి రైతులకు మొక్కలు పంపిణీ చేసి వేలంకేంద్రంలో మొక్కలు నాటారు.

# కఠిన నిర్ణయాలు అవసరం




రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 22: నదుల్లో బోటు ప్రమాదాల తగ్గాలంటే కఠిన నిర్ణయాలు అవసరమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో జాతీయ విపత్తుల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి నదిలో ఇటీవల జరిగిన బోటు ప్రమాదం చాలా విచారకరమన్నారు. బోటు నడిపే డ్రైవర్లకు తప్పని సరిగా ఆ నదిపై క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. బోటులో ప్రయాణించే అందరూ లైఫ్ జాకెట్లు ధరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా బోటు యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా బోటు ఉంటే ఆ బోటు లైసెన్స్ రద్దుచేయాలని, ఎంత మంది సిబ్బంది ఉండాలో సాంకేతికంగా నిర్ణయించాలన్నారు. బోటు ప్రమాదం సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్, పోలీసు, ఇతర శాఖలు ఎంతో కృషిచేస్తున్నాయన్నారు. ఈ సమీక్షలో ముందుగా జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి నదికి రెండు నెలల వ్యవధిలో నాలుగు సార్లు వరదలు సంభవించడంతో నష్టాలను చవి చూడటం జరిగిందన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు, ఆస్తి నష్టాలకు సంబంధించిన నివేదికలు తెలియజేశారు. సహాయక చర్యల్లో కొత్త టెక్నాలజీని ఉపయోగించే విధంగా రక్షణ మంత్రిత్వ శాఖలతోపాటు హోం శాఖ విభాగాలతో చర్చించడం జరుగుతుందని మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ అధికారులు మాట్లాడుతూ బోటు చాలా క్లిష్టమైన ప్రాంతంలో మునిగి ఉందని, సుడులు తిరుగుతున్న నీటిలో బురదమయంగా ఉండటంతో పరికరాలు ఉపయోగించినప్పటికీ స్పష్టత లేదని తెలియజేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ గోదావరి నదిలో జరిగిన ప్రమాదం చాలా విచారకరమన్నారు. గోదావరినదిలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పందించారన్నారు. ప్రస్తుతం శాస్త్ర పరిజ్ఞానం ఎంతగానో అభివృద్ధి చెందిందని, నదిలో మునిగి ఉన్న బోటును వెలికి తీయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందిస్తూ ఈ విషయమై ఢిల్లీ వెళ్లి సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన ఆధునిక శాస్త్ర పరిజ్ఞానంతోపాటు పరికరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మంత్రి బోస్ కోరారు. శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు మాట్లాడుతూ బోటును నడిపే డ్రైవర్‌కు నదిపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. జిల్లా యంత్రాంగమంతా రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సమీక్షలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

కలెక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు అంచనా వేస్తున్నామన్నారు. అమరావతిలో ఇరిగేషన్ స్పెషల్ సీఎస్ ఆధ్వర్యంలో ఒక కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ సమావేశంలో నదుల్లో బోటు ప్రమాదాలు జరగకుండా తగిన సూచనలపై చర్చిస్తారన్నారు. జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో మెజిస్టీరియల్ విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృదాలు మృతదేహాలను వెలికి తీయడానికి నిరంతరం అనే?వషిస్తున్నాయన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అనే?వషణ ఆగదన్నారు. మునిగిపోయిన బోటును వెలికితీయడానికి అనేక మంది నిపుణుల సలహాలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెలుబుచ్చిన సూచనలు కూడా అమరావతిలో జరగనున్న సమావేశంలో చర్చిస్తామన్నారు.

సమావేశంలో ఏపీ ఎస్పీ ఐజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్టీఆర్ఎఫ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో డిఐజీ ఏకే ఖాన్, జిల్లా ఎస్పీ అద్నాన్ నరు?మ్ అస్మీ, అర్బన్ ఎస్పీ షిమోషి బాజ్‌పాయ్, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ జహీద్ ఖాన్, సెకండ్ కమాండెంట్ కులదీప్ సింగ్, కోర్టు గార్డు కమాండెంట్ రాజ్ కమల్, అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచిచేసే..

# ఏ పనినైనా చేసేందుకు కేసీఆర్ సిద్ధం

**- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

**- వనపర్తిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన మంత్రి, కలెక్టర్**

వనపర్తి, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : ప్రజలకు మంచి చేసే పని ఏదైనా దానిని అమలు చేసేందుకు సీఎం



సోమవారం వనపర్తిలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

కేసీఆర్ ఎక్కడా వెనక్కు తగ్గరని, అలాంటి సీఎం దొరకడం మన రాష్ట్ర ప్రజల అదృష్టమని వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తిలోని కడుకుంట్ల గ్రామంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారనీ, ప్రజలకు మంచి చేసే ఏ పనినైనా సీఎం చేయడానికి సిద్దంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మహిళలకు బతుకమ్మ పండుగ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. పండుగ రోజు రాష్ట్రంలోని ప్రతి ఆడపడుచూ కొత్త బట్టలతో కళకళలాడుతూ ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న ఘనత తెరాసదే అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పచ్చగా మర్చేందుకు, మన రాష్ట్ర రైతులు దేశానికే ఆదర్శంగా నిలిచేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని అన్నారు. అందులో భాగంగానే అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ద్వారా రాష్ట్రంలో అనేక జిల్లాలకు సాగునీరు కొరత తీరుతుందని మంత్రి తెలిపారు. కాళేశ్వరం విజయవంతంగా పూర్తిచేశారని, ఇప్పుడు కేసీఆర్ దృష్టి పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై పడిందన్నారు. దీనిని వేగంగా పూర్తి చేయడం ద్వారా పాలమూరు ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలతో పాటు నల్గొండ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించటం జరుగుతుందని మంత్రి తెలిపారు. చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంత్రి చీరల పంపిణీతో పాటు మహిళలకు ఓ మొక్కను కూడా బహూకరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్వేతా మొహంతి, జెడ్పీ ఛైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కథువాలో 40 కిలోల పేలుడు పదార్ధాలు స్వాధీనం

హైదరాబాద్, సెప్టెంబర్ 23: జమ్మూకశ్మీర్‌లో సుమారు 40 కిలోల పేలుడు పదార్ధాలను స్వాధీనం చేసుకున్నారు. కథువా ప్రాంతంలోని దివాల్ గ్రామం నుంచి వాటిని సీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధం ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సోదాలు చేశారు. గాలింపు జరిపిన ప్రాంతం నుంచి స్థానికంగా తయారయ్యే పేలుడు పదార్ధాలను స్వాధీనం చేసుకున్నారు.

## ఏపీ వార్తలు

# అసలు సినిమా ఇప్పుడే మొదలైంది

**- ట్విటర్‌లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి**

అమరావతి, సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : మాజీ ముఖ్యంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై వైఎస్ఆర్సీపీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మరోసారి ట్విట్టర్ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. పోలవరం ప్రాజెక్టులో దోచుకున్న సొమ్ముతో చంద్రబాబు ఎన్నికల్లో గెలవాలని చూశారని ఆయన విరుచుకుపడ్డారు. అయితే, ప్రజలు తపుక్కుమని ఉమ్మడంతో నడుములిరిగేలా నేలపై పడ్డారని, డ్యాం పునాదుల నుంచి అవినీతి సాక్ష్యాలు ఉబికివస్తున్నాయని విజయసాయి ధ్వజమెత్తారు. అంతేకాదు, ఎవరి కాళ్లు పట్టుకుని బయటపడాలా అని చంద్రబాబు వెతుకుతున్నారని, అసలు సినిమా ఇప్పుడే మొదలైంది బాబు అంటూ దుయ్యబట్టారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు, ప్రవేశపెడుతున్న పథకాలను 15రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని.. రివర్స్ టెండరింగ్, జ్యుడీషియల్ కమిషన్, అమ్మ ఒడి, గ్రామ వాలంటీర్ వ్యవస్థ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం వంటి అంశాలను పరిశీలిస్తున్నారని విజయసాయి అన్నారు. తొలిసారి సీఎం అయిన 46ఏళ్ల యువకుడు దేశానికి మార్గదర్శిగా నిలుస్తున్నారంటూ జగన్‌పై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. పుష్కరాల్లో 27మందిని పొట్టన పెట్టుకుని కుంభమేళాల్లో, బస్సు ప్రమాదాల్లో ప్రాణాలు పోవడం లేదా అంటూ చంద్రబాబు దబాయించాడని అన్నారు. లాంచీ ప్రమాదానికి ప్రైవేటు వ్యక్తులు కారణమైనా బాధ్యత ప్రభుత్వానిదే అంటూ జగన్మోహన్‌రెడ్డి హుందాగా అంగీకరించారని అన్నారు. నాయకుడికి, ఈవెంట్ మేనేజర్‌కు మధ్య తేడా ఇదేనంటూ ఎద్దేవా చేశారు.

## వరసగా నాలుగు రోజులు బ్యాంకులు మూత

న్యూఢిల్లీ,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ): విలీనానికి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె బాటపడుతున్నారు. ఈ నెలాఖరులో వరుసగా నాలుగు రోజుల పాటు జాతీయ బ్యాంకులు మూతపడనున్నాయి. సెప్టెంబర్ 26 నుంచి 29 వరకు బ్యాంకులు పనిచేయవని బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి. 26, 27 తేదీలలో దాదాపు నాలుగు లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి వ్యతిరేకంగా సమ్మె చేయనున్నారు. నాలుగవ శనివారం అయినందున 28వ తేదీ బ్యాంకులకు సెలవు. అదే విధంగా మరుసటి రోజు 29వ తేదీని ఆదివారం నాడు కూడా బ్యాంకులు పనిచేయవు. తిరిగి సోమవారం సెప్టెంబర్ 30వ తేదీనే బ్యాంకులు పనిచేయనున్నాయి. ఈ నాలుగు రోజుల పాటు చెక్ క్లియరెన్సులు, ఎటిఎం సర్వీసులకు విఘాతం ఏర్పడే అవకాశం ఉంది.




ఇసుక సమస్యపై సోమవారం విజయనగరం జిల్లా పార్వతీపురలో ఆందోళన చేస్తున్న భవన కార్మికులు.

# ముద్రగడ.. దమ్ముంటే ఇప్పుడు బయటకురా..!

**- బాబుకు లేఖలురాస్తే ఎవరూ పట్టించుకోరు**

**- నేరచరిత్ర ఉన్నవారిని టీటీడీ బోర్డు నుంచి తొలగించాలి**

**- మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే చినరాజప్ప**

కాకినాడ, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) :ముద్రగడ పద్మనాభం తన స్వార్థం కోసం రాజకీయాలు మాట్లాడుతున్నాడని, అధికారంలో ఉంది వైఎస్ జగన్ అయితే.. చంద్రబాబును తిడుతూ లేఖలు రావటం వల్ల ఉపయోగం ఏంటమని మాజీ హోం మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే చినరాజప్ప ప్రశ్నించారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకు ఇటీవల కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై చినరాజప్ప విలేకరులతో మాట్లాడారు.. ముద్రగడపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాపుల ఉద్యమాన్ని వైకాపాకు తాకట్టు పెట్టిన వ్యక్తి ముద్రగడ అని ఘాటుగా విమర్శించారు. కేసులకు భయపడి ముద్రగడ ఉద్యమాలు చేయడం లేదని.. దమ్ముంటే బయటకు వచ్చి ఉద్యమం చేయాలని చాలెంజ్ చేశారు. చంద్రబాబుకు లేఖలు రాయడం వల్ల ప్రయోజనం లేదని.. మీ లేఖలు, మిమ్మల్ని ఎవరూ పట్టించుకోరన్నారు. కేవలం తనా చంద్రబాబుపై కక్ష ఉంటే తాను చూసుకోవాలని, కాపు నేతగా చంద్రబాబుపై విమర్శలు చేసి నేనేం మాట్లాడితే కాపులు అదే మాట్లాడినట్లు అనడం సరికాదన్నారు. కాపుల్లో అత్యధిక శాతం చంద్రబాబుపైనే నమ్మకంతో ఉన్నారని, జగన్మోహన్‌రెడ్డి వల్ల కాపుల సమస్యలు తీరవని వారు గుర్తించారని అన్నారు. ఈ విషయాలను ముద్రగడ తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడి కాపులందరూ మాట్లాడినట్లు చిత్రీకరిస్తే చూస్తూ ఊరుకోరని అన్నారు. టీటీడీ పాలకమండలి జంబో జెట్‌లా ఉందని విలేకరులు ప్రశ్నించగా.. ఏపీ కన్నా ఇతర రాష్ట్రాల వారే ఎక్కువ ఉన్నారని అన్నారు. నేరచరిత్ర ఉన్నవారిని టీటీడీ బోర్డు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోలవరం ఎత్తు తగ్గించేందుకు జగన్ అంగీకరించాడని కేసీఆర్ సాక్షాత్తూ అసెంబ్లీలో ప్రకటించారన్నారు. ఎన్నికల్లో కేసీఆర్ చేసిన ధన సహాయానికి బదులుగా జగన్ ఏపీని తాకట్టు పెట్టేశాడని అర్థమవుతోందని చినరాజప్ప విమర్శించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు సూచించినట్లే జగన్ పాలన సాగుతుందని, దోపిడీలు, దాడులు, కక్షలతో పాలన సాగిస్తున్నారని, ప్రజా అవసరాలకు కోసం పాలన ఎక్కడా సాగించినట్లు కనిపించటం లేదని చినరాజప్ప విమర్శించారు.

# నలుగురు పిల్లలకు విషమిచ్చి తానుతాగిన తల్లి

**- తల్లి మృతి, చిన్నారుల పరిస్థితి విషమం**

**- కర్నూల్ జిల్లాలో విషాద ఘటన**

కర్నూల్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : కర్నూలు జిల్లా డోన్ లోని తారకరామా నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. నలుగురు పిల్లలకు పురుగుల మందు తాగించి, తానూ తాగి తల్లి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఐదుగురిని కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో తల్లి మృతి చెందింది. నలుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం తారకరామా నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వడ్డె వరలక్ష్మి(36) అనే మహిళ సోమవారం ఉదయం భర్తతో గొడవపడింది. క్షణికావేశంలో నలుగురు చిన్నారులైన ఇందు(12), ఉమాదేవి(9), ఉదయ్‌కుమార్(5), ఐశ్వర్య(1)ల చేత విషం తాగించింది. అనంతరం తానూ తాగి అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు హుటాహుటిన డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతిచెందింది. నలుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కంబగిరి రాముడు తెలిపారు. ఈఘటనతో బంధువులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరలక్ష్మి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది.

# టిటిడి పాలకమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

తిరుమల, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : నూతన సభ్యుల ప్రమాణ స్వీకారానంతరం జరిగిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సోమవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మండలి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు వ్యవహారం కోర్టు పరిధిలో వున్నందున ఆ అంశంపై పాలకమండలిలో చర్చించలేదని వైవి సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలలో శాశ్వత ప్రాతిపదికన నీటి సమస్యను పరిష్కరించేందుకు బాలాజీ రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు.. అవిలాల ట్యాంక్ అబివృద్ధికి కేటాయించిన నిధులను బాలాజీ రిజర్వాయర్ నిర్మాణానికి మళ్ళిస్తామన్నారు. టీటీడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సబ్ కమిటిని నియమించనున్నట్టు ఆయన తెలిపారు.రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న శ్రీవారి ఆలయానికి గత ప్రభుత్వం కేటాయించిన రూ.150 కోట్లను ప్రస్తు అవసరాల మేరకు రూ. 36 కోట్లకు కుదింపు చేసినట్లు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిని స్మార్ట్ సిటిగా ప్రకటించిన తరువాత టీటీడి నిధులు కేటాయింపు చెయ్యడం సమంజసం కాదన్నారు. గరుడ వారధికి ప్రభుత్వంతో సంప్రదించిన అనంతరం నిధులు కేటాయిస్తామని వైవి సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.



సోమవారం వనపర్తిలో బతుకమ్మ చీరలకు వచ్చిన మహిళలకు మొక్కను బహుమతిగా ఇచ్చిన తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

# బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్ , సెప్టెంబర్ 23: తెలంగాణ ఆడపడుచులను బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు అందించి గౌరవించుకునేందు కోసం ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. లక్ష్మణచాంద మండల కేంద్రంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దసరా కానుకగా సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఆడుపడుచులందరికీ సారే పెడుతుందన్నారు. ప్రతి ఏటా ఇచ్చినట్లే ఈ సారి కూడా దసరా కానుకగా బతుకమ్మ చీరలను అందజేస్తున్నామని తెలిపారు. వందకు పైగా డిజైన్లలో నాణ్యమైన చీరలను తయారు చేయించినట్లు వివరించారు. ఈ ఏడాది ప్రభుత్వం సుమారు రూ.300 కోట్లకు పైగా వెచ్చించిదన్నారు. అంతకు ముందు నిర్మల్ పట్టణం నందిగుండంలో దుర్గమాతకు తొలి బతుకమ్మ చీరను అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్‌ఆ విజయలక్ష్మి, కలెక్టర్ ప్రశాంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, లక్ష్మణచాంద సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాల పేరుతో ప్రత్యేక పూజలు

### మాయగాడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ): జనాన్ని మోసం చేస్తూ మంత్రాల పేరుతో పూజలు చేస్తున్నట్లు నటిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిని హుస్సేనిఅలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనిఅలం ప్రాంతానికి చెందిన టిప్పు సుల్తాన్, అలియాస్ టిప్పు బాబా(45)మహారాష్ట్రలోని పర్భానీ ప్రాంతానికి చెందినవాడు. గత కొన్నేండ్లుగా హుస్సేనిఅలం ప్రాంతంలో నివసిస్తూ తాంత్రీక శక్తులు ఉన్నాయని ప్రచారం చేసుకుంటూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నాడు. గత పౌర్ణమినాడు పురానాపూల్ శ్మశాకవాటికలో రాత్రి సమయంలో ప్రత్యేక పూజలంటూ పెద్దగా హాహాకారాలు చేస్తూ ప్రజలు భయపడేలా తాంత్రీక పూజలు నిర్వహించారు. దీనిపై స్థానిక ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టిప్పు బాబాను అదుపులోకి తీసుకున్నారు. తన వద్దకు వచ్చే బాధితులను బెదిరించి వీడియోలు తీసేవాడని గుర్తించారు. పూజలకు ఉపయోగించే పలు వస్తువులను, వీడియోలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు.

# వామ్మో.. మెట్రో!

**- అమీర్‌పేట్‌లో మౌనిక మృతితో ప్రయాణికుల బెంబేలు**
**- రసూల్‌పురలో మెట్రో నుంచి ఊడిపడిన పెచ్చులు**
**- ఎవరూ లేకపోవటంతో తప్పిన ప్రమాదం**
**- వరుస ఘటనలతో ఆందోళనలో ప్రయాణీకులు, నగరవాసులు**
**- రెండేళ్ల తరువాత బయటపడుతున్న లోపాలు**
**- నిర్మాణంలో లోపాలే కారణమంటూ స్థానికుల ఆగ్రహం**
**- మరోప్రాణం బలికాకుండా ప్రభుత్వం దృష్టిసారించేనా?**

హైదరాబాద్, సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : హైదరాబాద్‌కే తలమానికం అని గొప్పగా చెప్పుకుంటున్న మెట్రో .. ఇప్పుడు సామాన్యుల పాలిట కిల్లర్‌గా మారిందా..? పెచ్చులూడుతూ ప్రయాణికుల ప్రాణాలను హరిస్తుందా..? వరుసగా జరుగుతున్న ఘటనలతో ఇలాంటి అనుమానాలే వ్యక్తమవుతున్నాయి.. దీంతో వామ్మో.. మెట్రో అంటూ ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం సాయంత్రం మౌనిక మృతితో మెట్రో కింద ప్రయాణం సాగించాలన్నా.. మెట్రో ట్రైన్ ఎక్కేందుకు వెళ్లాలన్నా ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అమీర్‌పేట ఘటన మరువకముందే సోమవారం మెట్రో నుంచి పెచ్చులూడి పడ్డాయి.. ఆ సమయంలో ప్రయాణీకులు ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.

హైదరాబాద్ మెట్రో దేశానికి ఆదర్శం.. పూర్తి భద్రతా ప్రమాణాలతో తక్కువ వ్యవధిలో నిర్మించామని పలు సందర్భాల్లో నేతలు, మెట్రో అధికారులు ఘనంగా చెప్పుకొచ్చారు. దశాబ్దాల పాటు ఢోకా లేకుండా ఉంటుందని, వందేళ్లు సేవలందిస్తుందని గొప్పగా చెప్పారు. కానీ అమీర్ పేటలో మౌనిక అనే వివాహిత మహిళ మృతి చెందిన ఘటనతో నగరమంతా ఉలిక్కిపడింది. మెట్రో ఇన్నాళ్లూ సాంకేతిక లోపాలతో ఇబ్బంది పెట్టగా.. ఇప్పుడు నిర్మాణ లోపాలతో భయపెడుతోంది. పలు చోట్ల వయాడక్ట్ నుంచి సిమెంట్ పెచ్చులు ఊడిపతున్నాయి. దీనికితోడు సోమవారం ఉదయం మరో ప్రమాదం తప్పింది.. రసూల్‌పుర మెట్రో స్టేషన్‌లో పెచ్చులూడి పడిపోయాయి. అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో పెచ్చులు ఎలా ఊడాయో రసూల్ పురాలోనూ అదేరీతిలో పెచ్చులూడిపడ్డాయి.. ఆ సమయంలో ప్రయాణీకులెవరూ అక్కడ లేకపోవటంతో ప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదాలకు హడావుడిగా మెట్రో నిర్మాణ పనులు ముగించటం కారణంగా స్థానికులు పేర్కొంటున్నారు. దీనికితోడు ప్రీ కాస్ట్ కాంక్రీట్ నిర్మాణానికి దానిపైన బాండింగ్‌కు పటిష్టత లేకపోవటం, మెట్రో ట్రాక్ నిర్మాణం హడావుడిగా పూర్తిచేయడం, పిల్లర్లు, వయాడక్ట్ సెగ్మెంట్ల మధ్య ఖాళీలను పటిష్ఠంగా పూడ్చక పోవటం, మెట్రోట్రైన్ నడుస్తున్నా.. స్టేషన్‌లలో పనులు నిర్వహించటంతో పిల్లర్లు వణికి పెచ్చులూడి కిందపడుతున్నాయని తెలుస్తోంది.

### బీటలువారి దర్శనమిస్తున్న గోడలు..

నిర్మాణ సమయంలో పర్యవేక్షణ కొరవడడంతో ఏ స్టేషన్ లో చూసినా బీటలు వారిన గోడలు దర్శనమిస్తున్నాయి. ప్రతి స్టేషన్ లోనూ సివిల్ పనుల్లో లోపాలు రోజులు గడిచేకొద్దీ బయటపడుతున్నాయి. వయాడక్ట్ పైన శబ్ద నియంత్రణకు దోహదపడేలా అటు ఇటు నిర్మించిన ప్రహరీ నుంచి కొన్ని వస్తువులు వేలాడుతూ కింద ఉన్నవారిని భయపెడుతున్నాయి. మెట్రో స్టేషన్లలో గోడలకు బీటలు రాగా, మరుగుదొడ్ల మురుగు రోడ్లపైకి వస్తోంది. స్టేషన్ లోని మరుగుదొడ్ల నుంచి నీరు లీకేజీపై ఫిర్యాదులు ఉన్నాయి. ఇటీవల వినాయక చవితి నవరాత్రుల్లో ఖైరతాబాద్ స్టేషన్ దగ్గర ఎస్ బీఐ బ్యాంకు మార్గంలో వరద లీకై భక్తులపై పడింది. ఇలా పలు ఘటనలు వెలుగులోకి వస్తుండటంతో మెట్రో అంటేనే ప్రయాణికులు, నగర వాసులు భయాందోళన చెందుతున్నారు. స్టేషన్ల కింద సుందరంగా తీర్చిదిద్దే పనుల కోసం ఇప్పటికే వేలాది రూపాయులు ఖర్చు చేశారు. చాలా స్టేషన్లలో ఆ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అసెంబ్లీ, నాంపల్లి, గాంధీ భవన్, ఉస్మానియా ఆస్పత్రి స్టేషన్ పరికరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పాద బాటలు వదిలేశారు. మెట్రో రైలులో సాంకేతిక లోపాలు ప్రయాణికులు చికాకు పెడుతున్నాయి. ఆదివారం గాంధీభవన్ దగ్గర మెట్ర్ రైలు సడన్ బ్రేకులతో ఎగిరికింద పడటంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. ఇదే చివరి స్టేషన్ అంటూ ప్రకటన విన్పించిందని ప్రయాణికులు తెలిపారు. వరుసగా జరుగుతున్న సంఘటనలపై మెట్రో అధికారులు మాత్రం ఇప్పటి వరకు స్పందించ లేదు. మెట్రో స్టేషన్‌ల నాసిరకం నిర్మాణాలు రెండేళ్ల తరువాత ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో మెట్రో నిర్మాణ సంస్థపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మున్ముందు జరగకుండా, మరో ప్రాణం బలికాకుండా మెట్రో నిర్మాణ సంస్థ, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటో వేచి చూడాల్సిందే.

# బాసరలో కార్డన్ సెర్చ్- పలు వాహనాలు సీజ్

నిర్మల్,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : నిర్మల్ జిల్లా బాసర మండలంలో సోమవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 58 ద్విచక్రవాహనాలు, 7 ఆటోలతో పాటు రెండు కార్లు, ఒక ట్రాక్టర్ ను సీజ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ శశిధర్ రాజు మాట్లాడారు. సంఘ విద్రోహశక్తులకు అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే జిల్లాలోని ఆయా ప్రాంతాలలో కా÷-డ్గ÷న్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల నిఘా కోసం పెట్రో కారు బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సరైన పత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనం నడపకూడదన్నారు. కార్డన్ సెర్చ్‌లో 50 మంది పోలీసులు పాల్గొన్నారు.



సోమవారం నిర్మల్ లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

# చర్చలు విఫలం.. థామస్ కుక్ దివాళా




హైదరాబాద్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : విదేశీ ప్రయాణాలు చేసేవారందరికీ దాదాపు థామస్ కుక్ ఏజెన్సీ గురించి తెలిసే ఉంటుంది. అటువంటి దిగ్గజ సంస్థ ఇప్పుడు ఆర్థికంగా బోర్లాబొక్కలా పడింది. బ్రిటన్‌కు చెందిన ట్రావెల్ దిగ్గజం 'థామస్ కుక్ గ్రూప్ పీఎల్‌సీ'కి బెయిల్ అవుట్ ప్యాకేజీ ఇచ్చేందుకు బ్రిటన్ సర్కార్ తిరస్కరించింది. కంపెనీ నష్టాలకు డైరెక్టర్లు కారణమనే అనుమానాన్ని బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితి సమావేశంలో పాల్గొనడానికి వెళుతూ ఆయన మీడియాతో మాట్లాడారు. థామస్ కుక్ కంపెనీకి బెయిల్ అవుట్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం లేదని తేల్చి చెప్పారు. కంపెనీ డైరెక్టర్లపై కఠిన నిబంధనలు అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదనే అర్థం వచ్చే విధంగా ఆయన మాట్లాడారు. కంపెనీకి బెయిల్ అవుట్ ఇవ్వడమంటే నైతికతకు వచ్చిన ఆపదగా ఆయన అభివర్ణించారు. అదంతా ప్రజలు పన్నుల రూపంలో కట్టిన ధనమని జాన్సన్ అన్నారు.

ఆర్థిక కష్టాల నుంచి బయటపడటానికి థామస్ కుక్ కంపెనీ చివరి వరకు ప్రయత్నించింది. అదనపు అప్పుల కోసం చైనాకు చెందిన ఫోసన్ టూరిజం గ్రూపుతో ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధమైంది. ముందుగా 900 మిలియన్ పౌండ్లకు ఒప్పందం కుదిరినా ఆ తర్వాత మరో 200 మిలియన్ పౌండ్లు అదనంగా ఇవ్వాలని థామస్ కుక్ కోరింది. దీనికి ఫోసన్ అంగీకరించలేదు. దీంతో ఒప్పందం రద్దయ్యింది.

ఇదిలా ఉండగా, థామస్ కుక్ కంపెనీ దివాలా తీయడంపై థామస్ కుక్ ఇండియా స్పందించింది. దాని ప్రభావం తమపై ఉండదని తేల్చిచెప్పింది. థామస్ కుక్ ఇండియాను ఫెయిర్ ఫాక్స్ కంపెనీ 2012లో సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

# మాదిగలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

**- అక్టోబర్ 13న హైదరాబాద్‌లో మరో మహాదీక్ష చేస్తాం**
**- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ**

వరంగల్, సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, డిప్యూటీ సీఎం పదవిని మాదిగలకు అప్పగించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కేసీఆర్ డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. కేసీఆర్ మాదిగలకు మంత్రివర్గంలో ఆవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగలకు కేసీఆర్ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఆదివాసులకు మంత్రి మండలిలో చోటు కల్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో బ్రాహ్మణ, వైశ్యులకు కూడా తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు అక్టోబర్ 13 తేదీన హైదరాబాద్ లో మరో మహా దీక్ష చేస్తామని తెలిపారు. డిసెంబర్ 13 ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంద కృష్ణ తెలిపారు. రాష్ట్రంలో 12శాతం మంది మాదిగ, ఉపకులాలకు సంబంధించిన వారున్నప్పటికీ మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జనాభా 90శాతం ఉంటే ఆయా వర్గాలకు 90శాతం స్థానాలు ఎందుకు దక్కలేదని ప్రశ్నించారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని మాట తప్పిన కేసీఆర్, ఇప్పుడు, ఉపముఖ్యమంత్రి పదవిని కూడా తీసేసి మళ్లీ మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనఆర్టీ వర్గాలతో కలిసి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు.

# బ్రేక్‌లు ఫెయిల్ అయ్యి.. మెట్రో ఫిల్లర్‌ను ఢీకొన్న బస్సు

**- పలువురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు**
**- తప్పిన పెను ప్రమాదం**

హైదరాబాద్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : మెట్రో స్టేషన్ పెచ్చులు ఊడిపడి ఓ మహిళ చనిపోయి 24 గంటలు కాకముందే.. హైదరాబాద్ అమీర్ పేటలో మరో ఘోరం జరిగింది. ఆర్టీసీ బస్సు అదుపుతప్పి మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత రోడ్డు పక్కన ఉన్న షాపులోకి దూసుకెళ్లింది. అమీర్ పేట్ లోని గురుద్వార్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. సికింద్రాబాద్ నుంచి మియాపూర్ కు వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు టైర్ పంచర్ కావడంతో బ్యాలెన్స్ తప్పింది. మెట్రో పిల్లర్ ను ఢీకొంది. అప్పటికీ ఆగకుండా పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం మెట్రో పిల్లర్ నెంబర్ అ1442 దగ్గర ఉద్రిక్తత ఏర్పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 15మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో నలుగురికి గాయాలు కావడంతో స్థానికులు దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. రద్దీగా ఉండే ఈ ఏరియాలో బస్సు బీభత్సం సంచలనంగా మారింది. అప్పటికే మెట్రో స్టేషన్ పెచ్చులు ఊడి మహిళ చనిపోయన ఘటనతో షాక్ ఉన్న ప్రజలు.. ఈ ఘటనతో పరుగులు తీశారు. ఏం జరుగుతుందో కొద్దిసేపు అర్థం కాక అయోమయానికి గురయ్యారు. ఆ తర్వాత బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా కిందకు దింపారు. పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. బస్సును అక్కడి నుంచి తొలగించారు.టైర్ పంచర్ అయి.. మెట్రో పిల్లర్‌ను ఢీకొనటం ప్రమాదం తీవ్రత తక్కువగా ఉందని అధికారులు అంచనా వేశారు. లేకపోతే జనంపైకి దూసుకెళ్లి చాలా ప్రాణాలు పోయేవని ఆందోళన వ్యక్తం చేశారు.

## భార్యను కాపురానికి పంపించాలని..

# బాంబులు మెడలో వేసుకెళ్లిన భర్త

**- లేకుంటే ఆత్మహత్యచేసుకుంటానని బెదిరింపు**
**- అదుపులోకి తీసుకున్న పోలీసులు**
**- తమిళనాడులో ఘటన**

చెన్నై, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : ఏడాదిగా పుట్టింట్లోనే ఉంటున్న తన భార్యను కాపురానికి రప్పించేందుకు ఓ వ్యక్తి చేసిన ప్రయత్నం కుటుంబసభ్యులు, పోలీసులను ఉరుకులు పరుగులు పట్టించింది. తన భార్యను పంపకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి నాటుబాంబులు మెడలో వేసుకుని హల్‌చల్ చేశాడు. పోలీసులు ప్రయత్నం ఫలించి అతడు ఆ ప్రయత్నాన్ని విరమించుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వివరాల్లోకి వెళితే.. తమిళనాడు కడలూరు జిల్లాలోని నైవేలికి చెందిన మణికంఠన్‌కు భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య విభేదాలు వస్తుండటంతో ఏడాది క్రితం అతడి భార్య పిల్లాడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. భర్తతో కలిసి ఉండటం ఇష్టం లేదని విడాకులకు దరఖాస్తు చేసింది. ఓ వైపు విడాకులపై విచారణ కొనసాగుతుండగానే భార్యను తిరిగి తన దగ్గరకు రావాలంటూ మణికంఠన్ పట్టుబడుతున్నాడు. విడాకులు మంజూరైతే ఆమె శాశ్వతంగా తనకు దూరమవుతుందన్న ఆందోళనతో అత్తారింటికి చేరుకున్నాడు. మెడలో నాటు బాంబుల దండ వేసుకుని, చేతిలో కిరోసిన్ డబ్బా పట్టుకుని హల్‌చల్ చేశాడు. తన భార్యను కాపురానికి పంపకపోతే కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంటానని, నాటుబాంబులు పేల్చేసుకుంటానని బెదిరించాడు. అదే సమయంలో అటుగా వెళున్న ఓ కానిస్టేబుల్ ఈ ఘటనను చూసి వెంటనే అక్కడికి వచ్చాడు. విషయం తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిచ్చి సిబ్బందిని రప్పించాడు. మణికంఠన్‌ను రక్షించేందుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో ఆ కానిస్టేబుల్ అతడి రెండేళ్ల కుమారుడిని తీసుకొచ్చి వదిలాడు. నీ కొడుకు భవిష్యత్ కోసమైనా ఆత్మహత్య ప్రయత్నం విరమించుకో అని కానిస్టేబుల్ కోరడంతో మణికంఠన్ దిగొచ్చాడు. కిరోసిన్ డబ్బా, నాటుబాంబులు పక్కన పడేసి కొడుకుని హత్తుకున్నాడు. అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇలాంటి పిచ్చిపని ఎప్పుడూ చేయొద్దని హెచ్చరించారు. అయితే కొద్దిసేపటి క్రితమే తాను విషం తాగానని మణికంఠన్ చెప్పడంతో పోలీసులు అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

# మంచిర్యాలలో బతుకమ్మ చీరల పంపిణీ

మంచిర్యాల,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతిష్టాత్మంగా నిర్వహించే బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలు వివిధ జిల్లాల్లో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుండి బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభమైంది. బతుకమ్మ సందర్భంగా ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తుంది.

ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు బోర్లకుంట వెంకటేష్ నేత, స్థానిక ఎమ్మెల్యే దివాకర్ రావు పాల్గొని ఆడ బిడ్డలకు బతుకమ్మ కానుక అయిన చీరలను అందించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణలోని ప్రతి ఇంటికి ఒక పెద్ద కొడుకు లాగా కేసీఆర్ ఆలోచించి తెలంగాణ ఆడ బిడ్డలకు చీరలను అందిస్తున్నారని చెప్పారు. గత పాలకులు తెలంగాణ పండుగలను, సంస్కృతిని కాపాడ లేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి దేశానికే ఆదర్శంగా సీఎం కేసీఆర్ నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.




## లెక్క సరిచేసిన సౌతాఫ్రికా..


బెంగళూరు: చివరి టీ-20 మ్యాచ్‌లో సఫారీ జట్టు భారత్‌కు ఝలక్ ఇచ్చింది. 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మరో 3.1 ఓవర్లు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. సఫారీ సారథి క్వింటన్ డీ కాక్ ఛేదనలో రెచ్చిపోయాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశాడు. మామూలగానైతే ఇండియా ప్రత్యర్థి జట్టును స్పిన్ ఉచ్చులో బిగిస్తుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇండియా మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ, ఏ దశలోనూ వికెట్లు నిలుపుకోలేదు. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచినట్లు స్పిన్‌పై అటాక్ చేద్దామనుకున్న ఇండియా బ్యాట్స్‌మెన్‌ను సఫారీ జట్టు స్పిన్‌తోనే నిలువరించింది. పరుగులు రాకుండా అడ్డుకుంది. స్పిన్నర్లు ఫోర్టోయిన్(2/19), షంసి (1/23), పేసర్లు హెండ్రిక్స్ (2/14), రబాడా(3/39)తో రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 134 పరుగులకే పరిమితమైంది. భారత్ బ్యాట్స్‌మెన్‌లో టాప్ స్కోరర్ ధావన్(36). మిగితా బ్యాట్స్‌మెన్ రాణించలేదు.

135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ జట్టు కెప్టెన్ డీ కాక్(79 నాటౌట్) బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 16.5 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయిన సౌతాఫ్రికా అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. 4 ఓవర్లు వేసి 14 పరుగులు మాత్రమే ఇచ్చి, 2 కీలక వికెట్లు తీసిన హెండ్రిక్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. మూడు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో మ్యాచ్ ఇండియా గెలిచింది. దీంతో సిరీస్ 1-1 తో సమమైంది. ఇక తదుపరి మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ అక్టోబర్ 2న విశాఖపట్నంలో ప్రారంభమౌతుంది.

## గాయంతో తుదిపోరు నుంచి తప్పుకున్న దీపక్ పునియా

క్రీడలు

నూర్ సుల్తాన్ (కజకిస్థాన్): గత నెలలో జూనియర్ ప్రపంచ చాంపియన్‌గా అవతరించి.. సీనియర్ చాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టిన తొలిసారే ఫైనల్ చేరి చరిత్ర సృష్టించిన భారత యువ రెజ్లర్ దీపక్ పునియాను దురదృష్టం గాయం రూపంలో వెంటాడింది. సుశీల్ కుమార్ తర్వాత దేశానికి స్వర్ణం సాధించిన రెండో వీరుడిగా నిలువాలన్న దీపక్ ఆకాంక్షను గాయం అడ్డుకుంది. పసిడి పతకం కోసం ఆదివారం హసన్ యజ్దానీ (ఇరాన్)తో జరగాల్సిన ఫైనల్ నుంచి చీలమండల గాయం కారణంగా దీపక్ (86కేజీలు) తప్పుకున్నాడు. సెమిస్‌లోనే అతడు గాయపడ్డాడు. గాయం కారణంగా ఎడమ కాలిపై భారం మోపలేకున్నా. ఈ పరిస్థితుల్లో పోటీకి దిగడం చాలా కష్టం. యజ్దానీపై ఆడడం చాలా మంచి అవకాశమని తెలుసు. కానీ ఏం చేయలేని పరిస్థితి. దేశం కోసం స్వర్ణ పతకం గెలువాలని ఎంతో పరితపించా. దురదృష్టవశాత్తు ఈసారి సాధ్యం కాలేదు అని దీపక్ అన్నాడు. 2010లో సుశీల్ కుమార్(68కేజీలు) ప్రపంచ చాంపియన్‌గా అవతరించాక మరొకరు ఆ ఫీట్‌ను అందుకోలేకపోయారు. మొత్తంగా భారత రెజ్లర్లు ఈసారి ప్రపంచ



చాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు నెగ్గి టోర్నీ చరిత్రలో అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసుకున్నారు. పురుషుల విభాగంలో దీపక్ పునియా (రజతం), రాహుల్ అవారే (కాంస్యం), బజరంగ్ పునియా (కాంస్యం), రవి దహియా (కాంస్యం).. మహిళల విభాగంలో వినేశ్ ఫోగట్(కాంస్యం) పతకాలతో మెరిశారు. అంతకుముందు 2013లో అమిత్ దహియా (రజతం), బజరంగ్ పునియా (కాంస్యం), సందీప్ తులసీ యాదవ్ (కాంస్యం) పతకాలు సాధించారు.

రాహుల్‌కు కాంస్యం

నాన్ ఒలింపిక్ విభాగంలో రాహుల్ అవారే (61కేజీలు) అదరగొట్టే పోరాటంతో కాంస్య పతకాన్ని పట్టాడు. సెమిస్‌లోనే ఓడిన అతడు ఆదివారం జరిగిన కాంస్య పతక ప్లేఆఫ్ పోటీలో రాహుల్ 11-4తో టీలెర్ లీ (అమెరికా)ను మట్టికరిపించాడు. బౌట్ ప్రారంభంలో డబుల్ లెగ్ అటాక్‌తో అమెరికా రెజ్లర్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించగా అవారే దీటుగా ఎదుర్కొన్నాడు. వరుసగా రెండు పాయింట్లు సాధించడం సహా మొదటి రౌండ్‌లో 4-2 ఆధిక్యంలో నిలిచాడు. ఆ తర్వాత కుడికాలిని పట్టేందుకు యత్నించిన గ్రాఫ్‌ను రాహుల్ నిలువరించాడు. చురుగ్గా కదులుతూ ప్రత్యర్థికి చెమటలు పట్టించాడు. ఆ తర్వాత దూకుడుగా ఉడుం పట్లు పడుతూ ఆధిక్యాన్ని 10-2కు పెంచుకొని విజయం ఖాయం చేసుకున్నాడు.

# 2021లో.. మొబైల్ యాప్‌తో జనాభా లెక్కలు




హైదరాబాద్, సెప్టెంబర్ 23: డిజిటల్ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలు చేపట్టనున్నది. 2021లో డిజిటల్ ప్రక్రియ ద్వారా జనాభా గణన ఉంటుందని కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. ఒక ప్రత్యేకమైన డిజిటల్ యాప్ ద్వారా దేశ జనాభాను లెక్కించనున్నట్లు ఆయన వెల్లడించారు. పేపర్ నుంచి డిజిటల్ జనాభా లెక్కింపు దిశగా పరివర్తన జరుగుతుందని ఆయన అన్నారు. ఇవాళ ఢిల్లీలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్‌జీఐ) కొత్త బిల్డింగ్ శంకుస్థాపనలో కేంద్ర మంత్రి షా పాల్గొన్నారు. దేశంలో జనాభా లెక్కలు నిర్వహించేంది ఆర్‌జీఐ మాత్రమే. డిజిటల్ లెక్కింపు ద్వారా.. ఆధార్, పాస్‌పోర్ట్, బ్యాంక్ అకౌంట్, డ్రైవింగ్ లైసెన్సు లాంటి కార్డులన్నీ ఒకే ఫ్లాట్‌ఫామ్‌పైకి వస్తాయన్నారు. జనాభా లెక్కింపు ప్రక్రియ డేటాతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జతచేయడానికి ఎందుకు ఇబ్బందిపడడం అని ఆయన ప్రశ్నించారు. నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్)మరియ జనాభా లెక్కల కోసం సుమారు 12వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి పౌరుడి బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ వివరాలను ఎన్‌పీఆర్‌తో అనుసంధానం చేస్తారు.

## నిరుద్యోగ యువతిపై అత్యాచారం

### ఇంటర్వ్యూ పేరుతో హోటల్‌కు పిలిచి రేప్

ముంబై,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : ఇంటర్వ్యూ అని హోటల్ రూముకు పిలిచి ఒక 28 ఏళ్ల ఎంబిఎ గ్రాడ్యుయేట్‌పై అత్యాచారానికి పాల్పడిన ఒక ఢిల్లీ వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఈ దారుణ సంఘటన ఈ నెల 19న జరిగింది. బాధితురాలు గత ఏడాది ఉత్తర్ ప్రదేశ్‌లోని తన స్వగ్రామం నుంచి ముంబైకు వచ్చి ఇక్కడ ఒక పిజి వసతి గృహంలో ఉంటోంది. అయితే ఒక ప్రైవేట్ కంపెనీకి రాజీనామా చేసి తిరిగి తన స్వగ్రామానికి ఆమె వెళ్లిపోయింది. ఏప్రిల్‌లో తిరిగి వచ్చిన ఆమె ఆన్‌లైన్ నెట్‌వర్కింగ్ సైట్లలో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు సాగిస్తోంది. సాహిల్ సింగ్ అరోరా అనే వ్యక్తి జూలైలో ఆమెను సంప్రదించి రూ. 30,000 నెల జీతం ప్యాకేజీతో ఒక ప్రైవేట్ బ్యాంకులో హెచ్‌ఆర్ విభాగంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. సెప్టెంబర్ 19న జుహూలోని ఒక హోటల్‌లో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమెకు ఫోన్ చేశాడు. ఆమె గదిలోకి ప్రవేశించగానే తలుపు లాక్ చేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మరుసటి రోజు వరకు ఆమెపై పలుసార్లు అత్యాచారానికి పాల్పడి ఎవరికీ చెప్పవద్దని, చెబితే వీడియోలను ఆమె తండ్రికి పంపిస్తానని బెదిరించాడు. అయితే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి అరోరాను అరెస్టు చేశారు.

# వరసగా ఆరవ రోజూ పెరిగిన పెట్రోల్ ధర

### లీటర్‌కు రూ.0.31 పైసలు పెంపు

హైదరాబాద్,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : వరుసగా ఆరవ రోజు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. సోమవారం పెట్రోల్ ధర లీటరుకు 31 పైసలు పెరుగగా డీజిల్ ధర లీటరుకు 21 పైపలు పెరిగింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 78.57, డీజిల్ ధర రూ. 72.96 ఉన్నాయి. అమరావతిలో పెట్రోల్ ధర రూ. 78.01 ఉండగా డీజిల్ ధర రూ. 72.14 ఉంది. విజయవాడలో పెట్రోల్ ధర రూ. 78.14 ఉండగా డీజిల్ ధర రూ. 72.20 ఉంది.

# ఇద్దరు పిల్లల ఉసురు తీసిన తల్లి

### - లక్నోలో విషాద ఘటన

లక్నో, సెప్టెంబర్23(ఆంఎన్ఎ) : క్షణికావేశంలో దారుణానికి ఒడిగట్టిందో తల్లి. ముక్కుపచ్చలారని తన కన్నబిడ్డల ఉసురును తనే తీసేసింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వాసిమ్, నజ్మా దంపతులకు కవలలు పుట్టి 20రోజులు అవుతోంది. అయితే వాసిమ్.. పనీపాటా లేకుండా గత కొన్నిరోజులుగా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. దీనిపై భార్య నజ్మా అసహనంతో ఉంది. ఇదే విషయమై వీరిద్దరి మధ్య ఘర్షణ పూరిత వాతావరణం నెలకొంది. భర్త తీరుకు తీవ్రంగా నొచ్చుకున్న నజ్మా.. తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఊరిచెరువు దగ్గరకు వెళ్లింది. వారిని అందులో పడేసింది. అయితే తొందరపాటుతో తను చేసిన దాన్ని గుర్తించిన ఆమె.. తన పిల్లల్ని ఎవరో కిడ్నాప్ చేశారంటూ నాటకానికి తెరలేపింది. స్థానికులకు కూడా అదేచెప్పింది. పైపెచ్చు స్థానిక శిఖేరా పోలీస్టేషన్‌లో తమ పిల్లలు కిడ్నాప్‌కు గురయ్యారంటూ దంపతులిద్దరూ ఫిర్యాదు చేశారు. అయితే విచారణలో తన తప్పును నజ్మా అంగీకరించింది. భార్యాభర్తలపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారుల మృతదేహాలను వెలికి తీశారు.

## కాంగ్రెస్ నేతలకు చీరలు కాల్చిన పాపంతగిలింది

### - అందకే దారుణంగా ఓడిపోయారు

### - మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, సెప్టెంబర్23(నేటినిజం ప్రతినిధి) : బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు చీరలు పంపిణీ చేస్తే.. కాంగ్రెస్ నేతలు వాటిని కాల్చివేశారని, ఆపాపమే గత ఎన్నికల్లో వారికి జరిగిందని, అందుకే ఘోరంగా ఓడిపోయారని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో మంత్రి గంగుల చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ చీరలు అన్నవి సీఎం కేసీఆర్‌ఆడబిడ్డకు ఇస్తున్న కానుక అని, మహిళల కోసం అనేక పథకాలు తీసుకువచ్చిన కేసీఆర్ మరిన్ని పథకాలు ప్రకటిస్తారని అన్నారు. తెలంగాణలో అత్యంత భక్తి శ్రద్ధలతో మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించుకుంటారన్నారు. ఈసారి కూడా రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం పథకాలను వినియోగించుకోవాలని ఈసందర్భంగా ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించి ముందుకెళ్తున్నారని అన్నారు. మతం, కులం అనే తారతమ్యాలు లేకుండా తెలంగాణ ప్రజలంతా మనవాళ్లే అనే రీతిలో అద్భుత పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర రైతులను దేశానికే ఆదర్శంగా నిలిపేలా కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారని, అందులో భాగంగా ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసి ప్రతీ ఎకరాకు నీరు ఇవ్వటంతో పాటు రైతులకు అండగా నిలిచేలా కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కానీ మంచి పథకాలను ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# డిసెంబర్ 30లోగా ప్రక్రియను పూర్తి చేయండి

### ఆంధ్ర, ఒడిషాలకు వంశధార ట్రిబ్యూనల్ ఆదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : శ్రీకాకుళం జిల్లా నేరేడ్ బ్యారేజి వ్యవహారంలో సోమవారం వంశధార ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. నేరేడ్ బ్యారేజి కి సంబంధించి 106 ఎకరాల్లో ప్రహరీ గోడ కట్టేందుకు ఆంధ్ర, ఒడిషా రాష్ట్రాలు రెండూ కలిసి సర్వే చేసేందుకు గతంలో వంశధార ట్రిబ్యునల్ అనుమతినిచ్చింది. ఆర్డర్ లో మార్పులు చేయాలని ఒడిషా ప్రభుత్వం పెట్టుకున్న దరఖాస్తును ట్రిబ్యునల్ త్రోసిపుచ్చింది. 106 ఎకరాలకు జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి మ్యాప్ ను సిద్ధం చేయాలని, 106 ఎకరాలకు సంబంధించి సెంట్రల్ వాటర్ కమిషన్ మార్గదర్శకత్వంతో నివేదిక సిద్ధం చేయాలని, పూర్తి పక్రియను డిసెంబర్ 30 లోగా పూర్తి చేయాలని ఒడిషా, ఎపి ప్రభుత్వానికి వంశధార ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణను జనవరి 10 కి వాయిదా వేసింది. రెండు వారాల పాటు తీర్పును నిలుపుదల చేయాలని ఒడిషా చేసిన విజ్ఞప్తిని వంశధార ట్రిబ్యునల్ తిరస్కరించింది.

## ఏసిబి అధికారుల అదుపులో విద్యుత్ శాఖ ఏఈ

హైదరాబాద్,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : యూసుఫ్‌గూడ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ.. లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. విద్యుత్ మీటర్ బిగించేందుకు ఏఈ సుధాకర్.. ఓ వ్యక్తి నుంచి రూ. 60 వేలు డిమాండ్ చేశాడు. మొదటి విడుతగా రూ. 35 వేలు లంచం తీసుకుంటుండగా సుధాకర్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన కార్యాలయంలో అధికారులు సోదాలు చేస్తున్నట్లు సమాచారం.

## గుండెపోటుతో బస్సు డ్రైవర్ మృతి

శ్రీకాకుళం,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : విధుల్లో ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. తనకు గుండెపోటు వచ్చినా ఎంతో చాకచక్యంగా బస్సును పొలాల్లోకి తీసుకెళ్లి నిలిపివేసి ప్రయాణీకుల

ప్రాణాలను డ్రైవర్ కాపాడాడు. ఖమ్మం నుంచి భువనేశ్వర్ వెళున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టెక్కలి దగ్గరకు వచ్చే సరికి డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును పొలాల్లోకి దింపి మృతి చెందాడు. ఈ ఘటనలో నలుగురు ప్రయాణీకులకు స్వల్ప గాయాలు కాగా, వారిని ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు సురక్షితంగా ఉన్నారు.

# దేశరాజధానిలో తెలంగాణ గవర్నర్ తమిళసై

న్యూఢిల్లీ, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో గవర్నర్ భేటీ కానున్నారు. హర్యానాలో జరిగే గవర్నర్ల ఉపసంఘం సమావేశంలో తమిళిసై సౌందర్ రాజన్ పాల్గొననున్నారు. ఢిల్లీ పర్యటన ముగిసిన అనంతరం గవర్నర్ తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# శాసన మండలికి కేసీఆర్ కనీస గౌరవం ఇవ్వట్లేదు

### - కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : శాసన మండలికి తెలంగాణ సీఎం కేసీఆర్ కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. శాసనసభలో లెవనెత్తలేని అంశాలపై మండలిలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు. మండలిలో కేవలం ఆర్థికమంత్రితోనే సరిపెట్టడం సరికాదని.. అనేక అంశాలపై మండలిలో సరైన సమాధానాలు లభించలేదని మండిపడ్డారు. సీఎం సభకు వచ్చి ఉంటే ఆ అంశాలకు స్పష్టత వచ్చేదన్నారు. ఎస్టీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని జీవన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డనాటి నుంచి గిరిజనులు 720 మెడికల్ సీట్లు నష్టపోయారన్నారు. టెట్ పరీక్ష నిర్వహించకపోవడం దురదృష్టకరమన్నారు. పంటరుణాలపై ఆరు శాతం వడ్డీ రాయితీ రైతులకు అందడం లేదని.. గడచిన ఆరేళ్లలో గల్ఫ్ బాధితులకు ఆర్థిక సాయం అందలేదని.. తక్షణమే ప్రభుత్వం ఈ విషయాలపై చొరవ తీసుకోవాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎమ్మీ అవార్డులు.. వీరే విజేతలు



హైదరాబాద్: 71వ ఎమ్మీ అవార్డులను ఇవాళ ప్రదానం చేశారు. కామెడీ షో ఫ్లీబ్యాగ్ రచయిత, నటి ఫోబో వాలర్ బ్రిడ్జ్ మూడు అవార్డులను గెలుచుకున్నది. కిల్లింగ్ ఈవ్ షోలో నటించే జోడీ కామర్‌కు ఉత్తమ నటి అవార్డు దక్కింది. టీవీ ప్రోగ్రాముల్లో ఉత్తమ నటులకు ఇచ్చే ఎమ్మీ అవార్డుల కార్యక్రమం లాస్ ఏంజిల్స్‌లోని మైక్రోసాఫ్ట్ థియేటర్‌లో జరిగింది. ఫోబో వాలర్ బ్రిడ్జ్.. బెస్ట్ లీడింగ్ కామిటీ యాక్ట్రెస్, బెస్ట్ కామిడీ సిరీస్, బెస్ట్ కామిడీ రైటింగ్ అవార్డులను గెలుచుకున్నది. అయితే అతి ప్రతిష్టాత్మకమైన బెస్ట్ డ్రామా అవార్డును మాత్రం గేమ్ ఆఫ్ థ్రోన్స్ సొంతం చేసుకున్నది. ప్రస్తుతం గేమ్ ఆఫ్ థ్రోన్స్ ఎమిదవ సిరీస్ నడుస్తోంది. ఈ షోపై మిశ్రమ స్పందన వస్తున్నా.. ఎమ్మీ అవార్డుల్లో మాత్రం 8 ప్రైజ్‌లను ఎగురేసుకుపోయింది. గేమ్ ఆఫ్ థ్రోన్స్‌లో నటించిన ఫ్యాంటసీ స్టార్ పీటర్ డింక్లేజ్‌కు బెస్ట్ సపోర్టింగ్ డ్రామా యాక్టర్ అవార్డు దక్కింది.

## అట్లీ దర్శకత్వంలో ఎన్‌టీఆర్ ?


కోలీవుడ్‌లో అపజయమెరుగని దర్శకుడిగా రాణిస్తున్న యువ దర్శకుడు అట్లీ. రాజారాణి చిత్రంలో దర్శకుడిగా తన పయనాన్ని ప్రారంభించిన ఈయన దర్శకుడు శంకర్ శిష్యుడన్న విషయం తెలిసిందే. తొలి చిత్రంతో శభాష్ అనిపించుకున్న అట్లీ ఆ తరువాత నటుడు విజయ్‌తో వరుసగా తెరి, మెర్శల్, తాజాగా బిగిల్ చిత్రాలను చేశారు. తెరి హిట్ చిత్రం అయితే మెర్శల్ చిత్రం సూపర్‌హిట్ అయ్యింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బిగిల్ చిత్రం అంతకు మించి హిట్ అవుతుందనే నమ్మకంతో ఉన్నారు. నయనతార నాయకిగా నటించిన ఈ చిత్రం దీపావళికి తెరపైకి రానుంది. ఇకపోతే దర్శకుడు అట్లీ ఒక చిత్రం పూర్తి చేయగానే నెక్ట్సేంటి? అనే ఆసక్తి రేకెత్తుతుంటుంది.

అలా మెర్శల్ తరువాత అట్లీ టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్నాడు. అక్కడ ఒక స్టార్ హీరోతో చిత్రం చేయనున్నారనే ప్రచారం సాగింది. అయితే అది ప్రచారానికే పరిమితమైంది. ఇప్పుడు బిగిల్ చిత్రం పూర్తి కావచ్చింది. ఇప్పుడు నెక్ట్సేంటి? అన్న ప్రశ్నకు మళ్లీ తెలుగులో చిత్రం చేయనున్నాడు అనే ప్రచారం మొదలైంది. అవును ఈయన టాలీవుడ్ యంగ్‌టైగర్ ఎన్టీఆర్ హీరోగా చిత్రం చేయనున్నారనే టాక్ స్ప్రెడ్ అయ్యింది. అయితే జూనియర్ ఎన్టీఆర్కు తమిళంలో నటించాలన్న ఆశ చాలా కాలంగా ఉంది. త్వరలో అది నెరవేరనుందనే ప్రచారం జరుగుతోంది. అయితే ఆయన ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో నటించడానికి సిద్ధం అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాంటిది తాజాగా ఆయనతో దర్శకుడు అట్లీ చిత్రం చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం వైరల్ అవుతోంది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ రాజమౌళి దర్శకత్వంలో ఆర్ఆర్ఆర్ చిత్రంలో రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తున్నారు. ఈ చిత్రం తరువాత అట్లీ దర్శకత్వంలో నటించే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. అట్లీ బిగిల్ చిత్ర నిర్మాణాంతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రం విడుదల తరువాతనే ఆయన తన తాజా చిత్రం వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

# 'అరుంధతి' బాలీవుడ్ రీమేక్‌లో కరీనా?

సినిమా..



ప్రస్తుతం తెలుగు సినిమాలకు దేశవ్యాప్తంగా క్రేజ్ పెరిగింది. కొన్ని సినిమాలు నేరుగా హిందీలో విడుదలవుతుంటే.. మరికొన్ని రీమేక్ అవుతున్నాయి. మరోవైపు యూట్యూబ్‌లోనూ తెలుగు సినిమాల హిందీ వెర్షన్లు మిలియన్ల కొద్దీ వ్యూస్ సాధిస్తున్నాయి. దీంతో బాలీవుడ్ మేకర్ల దృష్టి ఇప్పుడు తెలుగు సినిమాలపై పడింది. ఈ నేపథ్యంలో అనుష్క గతంలో నటించిన 'అరుంధతి' చిత్రం త్వరలో హిందీలోకి రీమేక్ కాబోతోందట.నిజానికి తెలుగులో విడుదలై సంచలన విజయంగా నిలిచిన వెంటనే ఈ సినిమాను హిందీలోకి రీమేక్ చేయాలనుకున్నారు. రీమేక్ రైట్స్ కూడా అప్పట్లోనే ఓ బాలీవుడ్ చిత్ర నిర్మాణ సంస్థ చేజిక్కించుకుంది. అయితే పలు కారణాల వల్ల ఇప్పటివరకు రీమేక్ ప్రయత్నాలు సఫలం కాలేదు. అయితే ప్రస్తుతం తెలుగు సినిమాలకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ సినిమాను పట్టాలెక్కించాలనే ప్రయత్నం జరుగుతోందట. ఈ సినిమాలో జేజమ్మగా కరీనా కపూర్‌ను తీసుకోవాలనుకుంటున్నారట. కరీనా ఈ పాత్రకు సరిగ్గా సరిపోతోందని భావిస్తున్నారట. ఒకవేళ కరీనా కాదంటే అనుష్క శర్మను సంప్రదించాలనుకుంటున్నారట. మరి, ఈసారైనా ఎలాంటి ఆటంకాలూ లేకుండా ఈ సినిమా పట్టాలెక్కుతుందో, లేదో చూడాలి.


రంజని,

**తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్ 500004**



### నేటినిజం దినపత్రిక -రంజని
### విశ్వనాథ పద్య కవితా పోటీలు 2019

మఱల నిదేల రామాయణం బన్నచో నీ ప్రపంచక మెల్ల నెల్ల వేళ
దినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్ళుతనరుచి బ్రదుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన
తలచిన రామునే తలంచెద నేనును నా భక్తిరచనలు నావిగాన...

అన్న"మాటలాడే వెన్నెముక, పాటపాడే సుషుమ్న, నిన్నటి నన్నయ్యభట్టు, ఈనాటి కవిసామ్రాట్టు, ప్రథమ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ". ఆయన పట్టి సాధించని సాహిత్య ప్రక్రియ లేదు, మెట్టి చూడని సారస్వతమూ లేదు. "సంస్కృతంలో ఇప్పుడు వ్రాస్తే ప్రాచీన కవుల పరంపరలో ఏ వెయ్యిన్నొక్కటో వాణ్ణో అవుతాను. తెలుగులోనంటారా పన్నెండుగురు ప్రాచీన మహాకవుల తర్వాత పదమూడో వాణ్ణి నేను " అని స్వయంగా ప్రకటించుకున్నట్లే శిల్ప వైలక్ష్యంలో, భావన సౌకుమార్యంలో, దేశిచ్ఛందో విశేషంలో, కల్పనా సాహిత్యంలో విశ్వనాథ వారి తరువాతే ఎవరైనా.

'గిరి కుమారుని ప్రణయ గీతాలు' అయన తొలి కవిత. ఆ తరువాత ఆంధ్ర ప్రశస్తి , ఋతుసంహారం, రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు రాసారు. కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్లి, టానిసల దీవి, ఉయ్యాలతాళ్లు వంటి గేయ కావ్యాలు, ఏకవీర, వేయిపడగలు, చెలియలికట్ట, బద్దన్నసేనాని, సముద్రపుదిబ్బ, మ్రోయుతుమ్మెద వంటి నవలలు, నర్తనశాల, సౌప్తిక ప్రళయం, అనార్కలి, వేనరాజు, త్రిశూలం, కళింగరాజ్యం వంటి నాటకాలు, శర్మిష్ఠ వంటి సంస్కృత నాటకాలు, ఎన్నో కథలు, పురాణవైర గ్రంథమాల పేరుతొ ఎన్నో నవలలు...మొత్తం లక్ష పుటలకు పైగా సాహిత్యం అందించిన విశ్వనాథ సత్యనారాయణ గారు ' రంజని' ని ఎన్నో పర్యాయాలు సందర్శించారు. అకౌంటెంట్ జనరల్ గా పదవి విరమణ చేసి అమెరికాలో ఉంటున్న శ్రీ ఏ. సత్యవర్ధన, IA & AS గారి సౌజన్యంతో రంజని తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ పేరు మీద 2008 నుంచి '**రంజని- విశ్వనాథ పద్య కవితా పోటీలు**' నిర్వహిస్తోంది.

బహుమతులు : ప్రథమ బహుమతి రూ. 2,000/- , ద్వితీయ బహుమతి రూ. 1,500 /- మూడు తృతీయ బహుమతులు (500/-) మొత్తం 5,000/- (యోగ్యతాపత్రాలతో సహా)

నిబంధనలు: ఏ ఛందస్సు లోనైనా ఒక అంశం మీదే 12 పద్యాలకు తక్కువ కాకుండా ఉండాలి. సామాజికత తప్పనిసరి. ఇంతవరకు ప్రచురణ, ప్రసారంకానివి, దేనికి అనువాదం, అనుక(స)రణ కాని పద్య కవితల్నీ మాత్రమే పంపాలి. ఇందుకు సంబంధించిన హామీ పత్రాన్ని విడిగా జతపరచాలి. ఒకరు ఎన్ని పద్యకవితాలైనా పంపవచ్చు. పద్యకవితాల్నీ కాగితంపై ఒక వైపే రాయాలి. పద్య కవితలు పంపే కవరు పై ' రంజని- పద్యకవితా పోటీలు- 2019' అని పేర్కొవాలి. పద్యకవిత ఉన్న కాగితం పై పేరు, విలాసం తదితర వివరాలు వ్రాయకూడదు. పూర్తిపేరు, చిరునామా వివరాలు హామీ పత్రంలో మాత్రమే పేర్కొనాలి. విజేతలకు ఫలితాలను నేరుగాను, పత్రిక ముఖంగాను తెలియచేస్తాం. ఎంపికైన పద్యకవితలను ప్రచురించే హక్కు రంజనిదే. న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.

చిరునామా: ప్రధాన కార్యదర్శి, రంజని, తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్, హైదరాబాద్— 500004.

చివరితేదీ: 31 అక్టోబర్ 2019

నందిరాజు పద్మలత జయరాం
అధ్యక్షులు
9492921383

మట్టిగుంట వెంకట రమణ
ప్రధాన కార్యదర్శి
83748


## పార్వతీపురంలో భవన కార్మికుల ఆందోళన

విజయనగరం,సెప్టెంబర్ 23( ఆర్ఎన్ఎ) : ఇసుక సమస్య పరిష్కారానికిగాను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పార్వతీపురంలో భవన నిర్మాణ కార్మికులు సోమవారం ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ గా సాగారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయాన్ని

ముట్టడించారు. భవన నిర్మాణ కార్మికులంతా కలిసి ఆర్టీసీ కూడలి వద్ద మనవహారం రాసారోకో చేపట్టారు. తక్షణమే ఇసుక సరఫరాను పునరుద్ధరించాలని కార్మికులంతా డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ నాయకులు భవన నిర్మాణ కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. గత రెండు గంటలుగా పార్వతీపురం విశాఖ రహదారిని భవన నిర్మాణం కార్మికులు దిగ్బంధనం చేశారు. దీంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. స్థానిక ఎమ్మెల్యే వచ్చి తమకు సమాధానం చెప్పాలంటూ భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు.

## పోలవరం ఘనత బాబుదే : పాలకొల్లు ఎమ్మెల్యే

కాకినాడ,సెప్టెంబర్23 (ఆంఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను మార్చే పోలవరం ప్రాజెక్టుకు ఆచరణ సాధ్యం చేసి చూపిన ఘనత చంద్రాబాబుదేనని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ గుర్తులు మిగలకుండా చేసేందుకే వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ పనులకు రివర్స్ టెండరింగ్ కార్యక్రమం చేపట్టిందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్ట్ భద్రత గాల్లో ఉంచిన ఘనత వైసీపీదేనని అన్నారు. గోదావరి జిల్లాల ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకునే హక్కు ఈ ప్రభత్వానికి లేదన్నారు. ఆంధ్రపదేశ్ హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టిన ఘనత కూడా జగన్‌దేనన్నారు. కాటన్ దొర గోదావరి జిల్లా ప్రజలకు అన్నం పెడితే.. ఇవాళ ముఖ్యమంత్రి జగన్ సున్నం పెడుతున్నారని నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు.

# నిరసన బాటలో నాగార్జునా వర్సిటీ బోధనాయేతర సిబ్బంది

గుంటూరు, సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : బోధనాయేతర సిబ్బందికి ప్రమోషన్లు, జాతాల పెంపును నిలిపివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో సోమవారం ఉదయం నాన్ టీచింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ నిర్ణయంతో ఆగ్రహంగా ఉన్న ఉద్యోగులు ఈరోజు యూనివర్శిటీ బయట గేట్లకు తాళాలు వేసి బస్సులను అడ్డుకుని కాసేపు నిరసన తెలిపారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్ కార్యాలయాలను చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వారు నిరసన గళం విప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారు తప్పు పట్టారు. గత ప్రభుత్వ హయాంలో యధావిధిగా కొనసాగిన నిర్ణయాలను కొత్త ప్రభుత్వం నిలిపివేయడం తగదన్నారు. దీంతో తాము నష్టపోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి పలువూర్లు నివేదించినా పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిజానికి యూనివర్శిటీలో రిటైరు అయిన వారి తర్వాతి స్థానంలో ఉన్న వారికి ప్రమోషన్లు వచ్చేవని అంటున్నారు. అయితే ఈ విషయంలో గత ప్రభుత్వ హయాంలో అనేక అవకతవకలు జరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి యూనివర్శిటీలో ఇదే పరిస్థితులు నెలకొన్నాయని భావిస్తున్న ప్రభుత్వం ఈ విధానాన్ని నిలుపుదల చేయాలంటూ గతంలో ఆదేశాలిచ్చింది. మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆదేశాల మేరకే హయర్ ఎడ్యుకేషన్ అన్ని యూనివర్శిటీలకు అధికారిక ఉత్తర్వులిచ్చిందని సమాచారం. దీంతో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఇవే ఆదేశాలను పాటించి నాన్ టీచింగ్ ఉద్యోగుల ప్రమోషన్లు నిలుపుదల చేశారు. దీనిపై ఆగ్రహిస్తున్న ఉద్యోగులు గత మూడు రోజులుగా పెన్ డౌన్ కూడా చేశారు. ఈ అంశంపై ఉద్యోగులు ఉన్నతాధికారులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. కానీ వారు ప్రభుత్వ ఆదేశానుసారమే తాము నడుచుకుంటున్నామని అన్నారు. దీంతో ఉద్యోగస్తులు నిరసన తెలిపారు.

## గ్రామ సచివాలయ పరీక్షా ఫలితాలు వెల్లడి

అమరావతి, సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ) : ఇటీవలే జరిగిన గ్రామ సచివాలయ పరీక్షలలో విజయం సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితా సిద్ధం చేసినట్లు పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ గిరిజ శంకర్ వెల్లడించారు. జిల్లాల వారీగా అన్ లైన్‌లో మెరిట్ లిస్ట్ పెట్టినట్లు చెప్పారు. రోస్టర్, రిజర్వేషన్లు ఆధారంగా మెరిట్ లిస్ట్ తయారు చేశామని, రేపటి (మంగళవారం) నుంచి జిల్లాల్లో అభ్యర్థుల ఒరిజనల్ సర్టిఫికేట్లు పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అన్‌లైన్‌లో కాల్ లేటర్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 27 నుంచి అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు జారీచేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

## విజయసాయిరెడ్డిపై చర్య తీసుకోవాలి

**– టీడీపీ నేత వర్ల రామయ్య**

అమరావతి, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ) : గ్రామ వాలంటీర్ల ఉద్యోగాల్లో 90శాతం మన వాళ్లకేనన్న వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై చర్య తీసుకోవాలని టీడీపీ నేత వర్ల రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై ట్విట్టర్ లో స్పందిస్తూ గ్రామ సచివాలయ పోస్టులూ ఎక్కువ శాతం

మనవాళ్లకే అన్నారని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డిపైన సుమోటో కేస్ రిజిస్టర్ చెయ్యాలన్నారు. వాలంటీర్ల ఉద్యోగాల్లో 90శాతం మన వాళ్ళకే, గ్రామ సచివాలయ పోస్టులు కూడా ఎక్కువ శాతం

మనవాళ్లకే అన్న ఆయనపై చర్య తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను మార్చే పోలవరం ప్రాజెక్టుకు ఆచరణ సాధ్యం చేసి చూపిన ఘనత చంద్రాబాబుదేనని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ గుర్తులు మిగలకుండా చేసేందుకే వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ పనులకు రివర్స్ టెండరింగ్ కార్యక్రమం చేపట్టిందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్ట్ భద్రత గాల్లో ఉంచిన ఘనత వైసీపీదేనని అన్నారు. గోదావరి జిల్లాల ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకునే హక్కు ఈ ప్రభత్వానికి లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టిన ఘనత కూడా జగన్‌దేనన్నారు. కాటన్ దొర గోదావరి జిల్లా ప్రజలకు అన్నం పెడితే.. ఇవాళ ముఖ్యమంత్రి జగన్ సున్నం పెడుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.